SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

**Digitized in 2006**
**by**
**Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.**
(http://www.thrinaina.com)

From the original owned by
**Sundarayya Vignana Kendram**
**and its partner Institutions**

as part of the
**British Library Endangered Archives Programme**
supported by the
**Lisbet Rausing Charitable Fund**

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

**Sundarayya Vignana Kendram,**
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

## COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

నరసింహదాసు, చిత్తూరు

# తిరుపతి తిరుమలయాత్ర

చిత్తూరు, 1924

Record no. 1551

Narasiṃhadāsu, Cittūru

Tirupati Tirumalayātra

Cittūru, 1924

Record no. 1551

**SUNDARAYYA VIGNANA KENDRAM**
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

నరసింహదాసు, చిత్తూరు.

తిరుపతి తిరుమలయాత్ర : కలియుగ వైకుంఠంబను తిరుమల తిరుపతి దివ్య క్షేత్రమహాత్మ్యము, శ్రీవేంకటేశ్వర పద్మావతీదేవి పరిణయమహోత్సవ వైభవము / చిత్తూరు నరసింహదాసుచే వ్రాయబడినది.- చిత్తూరు : మారుశెట్టి రుద్రయ్యనాయుండు, 1924.

82 p. ; 21 cm.

Record no. 1551

Narasiṃhadāsu, Cittūru.

Tirupati Tirumalayātra : kaliyuga Vaikuṇṭhambanu Tirumala Tirupati divyakṣētramahātmyamu, Śrīvēṅkaṭēśvara Padmāvatīdēvi pariṇayamahōtsava vaibhavamu / Cittūru Narasiṃhadāsucē vrāyabaḍinadi.- Cittūru : Māruśeṭṭi Rudrayyanāyuṇḍu, 1924.

82 p. ; 21 cm.

Record no. 1551

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB Date filming began:

+4

Sl. no. 446 - Acc. no. 4262

శ్రీ లక్ష్మీవేంకటేశ్వర పరబ్రహ్మణేనమః.

వేంకటేశ్వరభక్తి వలసినంతముక్తి.

# తిరుపతి తిరుమలయాత్ర

కలియుగ వైకుంఠంబను

# తిరుపతి తిరుమల దివ్యక్షేత్ర మహాత్మ్యము

శ్రీ వేంకటేశ్వర పద్మావతిదేవి పరిణయ మహోత్సవ వైభవము.



చిత్తూరు నరసింహదాసుచే వ్రాయబడి

తిరుపతి బుక్ సెల్లర్

మారుశెట్టి రుద్రయ్యనాయుడుచే

శ్రీ శారదా ముద్రాక్షరశాలయందు ముద్రింపించి ప్రకటింపబడియె,

చిత్తూరు.

1924.

Registered Copy right.] [దీనివెల 0—8—0.

2 1 OCT 192

శ్రీ

శుభమస్తు.

శ్రీ వేంకటేశార్పణమస్తు.

OCT 1924

కలియుగవైకుంఠంబను

# తిరుపతి తిరుమల దివ్యక్షేత్ర మహాత్మ్యము.

శ్లో॥ వేంకటాద్రిసమంస్థానం బ్రంహాండేనాస్తికించన।
వేంకటేశసమోదేవో నభూతోనభవిష్యతి॥

అనుటకు కథాక్రమంబెట్లనగా:—

## నైమిశారణ్య ప్రకరణము.

అఖండ సచ్చిదానంద స్వరూపుండగు విరూపాక్షుని కరుణా కటాక్షంబున ప్రపంచంబు సృజించు శక్తినిబొందిన చతురాననుండగు బ్రహ్మదేవుండు పూర్వకాలంబున నొకదినము దేవతులందరున్ను తన్ను బరివేష్టింప హంసవాహనారూఢుడై సరస్వతీ సమేతుడై నిండుకొలువుండు తరినచటికి మునీంద్రులు కొందఱరుగుదెంచి సాష్టాంగ నమస్కారంబులాచరించి లేచినిలిచి బహువిధంబుల స్తుతించి తమ్మిపూగద్దియ నెక్కు మేటీ దేవరవారి దివ్యపాదారవిందములే శరణంబుగాగ నందితిమి. మేము శ్రీమన్నారాయణునుగూర్చి యొక మేటి తపంబు సేయగోరి యున్నవారము. ఆతపంబెట్టి విఘ్నంబులేక నెఱ

వేయునటుల ఒకపుణ్యక్షేత్రంబును చూపి ప్రసాదింపవలయునని వేడికొనిరి. బ్రహ్మదేవు డదివిని తన హృదయకమలంబున శ్రీమన్నారాయణ పాదపద్మంబులం గీలించి ఓమునీంద్రులారా మీరుకోరునట్లు కానంజేసెదను అని దర్భపోచనత్తి చక్రంబుగావించి కట్టి భూమిపై దొరలించెను. దీనివెనుక మీరు వెంబడిపోతిరేని ఈచక్రమెచ్చట పోయి నిలుచునో యాతావే మీరు తపమాచరించుటకు దగినచోటని తెలిసికొండని చెప్పెను. ఇటుల బ్రహ్మదేవుండు దొర్లించిన యాచక్రంబును వెంబడింప మునివరులుపోవ నాచక్రము అతివేగముగాబోయి యొకచోటనిలిచెను. ఆప్రదేశమే తపంబునకు దగినచోటని యాలోచించి ఆనేమి (చక్రము) నిలిచినచోటికి నైమిశారణ్యమను నామము నంగి యాచోటనే యామునివరులు తపంబు చేసుకొనుచుండిరి.

అక్కాలంబున నచ్చోటికి మునులనేకులు చుట్టి సేవింప పదునెనిమిది పురాణంబులను నిర్మించిన వ్యాసభగవంతుని శిష్యుండగు సూతమహర్షి వేంచేసెను. వారిని చూచినతోడనే మునులందరున్ను లేచి యెదుర్కొని పిలుచుకొనివచ్చి యర్ఘ్యాసనంబున గూర్చుండ నియమించి యనేకోపచారంబులొనర్చి నమస్కరించి చుట్టుబలసి కూర్చుండి చేతులు ముకిలించి అయ్యా! దయాసమేతా 'సూతా' మీయనుగ్రహమువలన సకల పురాణములు విని మీకరుణాకటాక్షమున సంతుష్టులైతిమి. శ్రీ వేంకటాచల చరిత్రమును చెప్పవలెనని వేడగా సూతమహర్షి యదివిని ఆనందముతో ఓమునీంద్రులారా! మీరడిగిన ప్రశ్న అతి గోప్యమైనది. (యసాధారణమైనది) శ్రీ వేంకటేశ్వరుల లీలావతార చరిత్రమును నాకు తెలిపినవరకు మీకుబోధించెద భక్తి శ్రద్ధతో వినుండని యిట్లని చెప్పందొడంగెను.

మునీంద్రులారా ఈజంబూద్వీప భరతఖండంబునందు గోదావరినది దక్షిణమున తిరుపతియను దివ్యపావన క్షేత్రమొకటిగలదు. దీనికొక మైలుదూరమున నుత్తరభాగంబున వెంకటాచలంబను గిరిరాజంబున శ్రీ వేంకటరమణుడు తేజరిల్లుచుండును. ఈగిరిరాజము రమారమి తూర్పుపశ్చిమములు ముప్పది యామడలు నిడివిన్ని దక్షిణోత్తరములు పదియామడలు వెడల్పున్ను, రెండువేల అడుగుల యెత్తుకలిగి శేషాచలంబను పేరు ప్రసిద్ధికెక్కియున్నది. యిందు శిరోభాగంమున వక్షంబున లక్ష్మినిధరించియుండు శ్రీ వేంకటేశ పరబ్రహ్మము నివసించియున్న యాలయంబును మధ్యభాగమున అహోబిల క్షేత్రమున శ్రీ భ్రమరాంబాసమేత శ్రీ మల్లికార్జునస్వామి యాలయమును, (అహోబిల శ్రీశైలము కర్నూలు మండలములోనున్నవి.) యీమూడు పుణ్యక్షేత్రములతో కూడినవై ఈగిరిరాజము పూర్వభాగమందు ఆదిశేషునియొక్క పడగవలె గాలిగోపురారణ్యమును, ఉరమువలె అహోబిలమును, వాలము వలె శ్రీశైలమును వున్నవి. యీపర్వతము ఆదిశేషుని యాకారముగాని వంకర వంకరగా నున్నది ఈగిరి ప్రథమభాగము వేంకటాద్రి క్షేత్రము వీటినే కలియుగవైకుంఠమని చెప్పుదురు. 108 విష్ణుక్షేత్రములలో మిక్కిలి వుత్తమమైనది యేడుకొండలు వరుసగా వొకస్థలమందుండుటచే శ్రీ వేంకటేశ్వరులను యేడుకొండలవాడని నామధేయము కలిగియున్నది. అనేకమైన యోగులు యీగిరిమీద తపమాచరించుచున్నారు. యీధాత్రియందుగల 108 దివ్యతిరుపతులలో శ్రీరంగం, శ్రీముష్ణం, తోతాద్రి, సాలగ్రామము, నైమిశము, బదరికాశ్రమము, కాంచీపురము, వేంకటాచలమను యెనిమిది స్వయంవ్యక్తంబులలో యొకటియగు వేంకటాచలమను యీగిరిరాజమునకు నాలుగువిధ నామధేయములు కలవు. అవియేవన వాటినిందు వివరించెద.

1. వృషభాద్రి.
2. అంజనాద్రి.
3. శేషాద్రి.
4. వేంకటాద్రి.

1. కృతయుగమందు వృషభాసురుడు శ్రీమహావిష్ణువుతో యుద్ధముచేసి వధింపబడి మోక్షమును పొంద నుద్దేశించి వృషభాద్రి యొక్క మధ్యభాగములోనుండు అహోబిల క్షేత్రమును చెంది అచ్చట వుండు వరాహతీర్థములో స్నానముచేసి ఆతీర్థములో ప్రతిదినం నృసింహమూర్తిని ఆరాధించి తన శిరస్సును ఛేదించి స్వామియొక్క పాదములకు అర్పించి స్వామినిమెప్పించి పునః తనశిరస్సునుపొంది తపోనిష్ఠుండైవుండగా అతనిశిరస్సులోనుండి తపోగ్నిజనించి లోకమును దహించుచూ వచ్చినందున దేవతులు ఆ అగ్నిజ్వాలకు భయపడి బ్రహ్మదేవునివద్దకేగి ఆరాక్షసుని వృత్తాంతమును చెప్పెను. బ్రహ్మదేవునికి యేమిన్నితోచక దేవతులతోకూడ తానున్నూ శ్రీమహావిష్ణు వద్దకేగి వారినిస్తుతించి రాక్షసుని వృత్తాంతమును వారికి తెలిపి స్వామీ ఇట్టిదైత్యుడు భూలోకములో వుండినయెడల లోకము నశించును గనుక ఆరాక్షసుని జంపి లోకములో బాధ నివారణజేయవలెనని ప్రార్థించగా విష్ణువు బ్రహ్మాదులమొర నాలకించి వార్లకు సమాధానము చెప్పి సత్యలోకమునకు పంపె.

ఇట్లు అహోబిలక్షేత్రములో నృసింహస్వామికి పూజచేస్తూ వుండిన దైత్యునికి ప్రసన్నుడై ఓరి దైత్యా నీకేవరంబులు కావలయునో కోరితివేని అనుగ్రహించెదను అని భగవంతుడు ఆదైత్యునికి వచనంబిచ్చె. యిందుకుఆరక్కసుడు స్వామీ తమతో నేను యుద్ధమొసంగవలెనని వున్నానని చెప్పగా భగవంతుడు సమ్మతించి అలాగే వరమిచ్చెను. తరువాత రక్కసుండు తనమాయాప్రభావముచే అనేక రథాశ్వగజములను సృజించి సేనాసమేతుండై శ్రీహరితో యుద్ధమొనర్చవచ్చెను. శ్రీమహావిష్ణువు కొంతకాలము దైత్యునితో యుద్ధమొసంగి ఓరీ దైత్యుడా నీతోయుద్ధముమాని నాయొక్క చక్రాయుధముచే నిన్ను జంపెదనని నుడువగా అందుకు రక్కసుండు ఆనందముచే స్వామీ ముందు హిరణ్యాక్ష-హిరణ్యకశ్యప మొదలగు దైత్యులు



తమ చక్రాయుధముచే వధింపబడి మోక్షసామ్రాజ్యమును చెందిరి గనుక యిప్పుడు నేనున్నూ అలాగే తమ చక్రాయుధముచే మృతి చెంది మోక్షమును పొందవలెను. అయితే నేను ఈపర్వతములో తపస్సుచేసినందువల్ల యిదిమొదలు యీపర్వతమునకు నాపేరు కరుణింపవలెనని ప్రార్థించగ భగవంతుడు సమ్మతించి ఆరాక్షసుని సంహరించి అదిమొదలు ఆపర్వతమునకు వృషభాద్రియని నామధేయము చేసెను.

2. త్రేతాయుగమున కేసరి అను వానరశ్రేష్ఠునికి అంజనా అను భార్యవుండెను. వీరిరువర్లున్ను అనేక పర్వతములలోనున్ను, వనములలోనున్ను క్రీడాసక్తులై వుండి పుత్రసంతానము లేదని చింతతో ఋష్యమూక పర్వతమునుకేగి అచ్చట తపస్సు చేస్తూవుండిన మతంగముని దర్శనముచేసి తమకు పుత్రసంతానమునకు ఉపాయము కరుణింపవలెనని ప్రార్థనచేయను ఆమునీశ్వరుడు అంజనాదేవినిచూచి ఓఅంజనాదేవి భూలోకములో ఉత్తర దిగ్భాగములో కైలాసమనే మహా శివక్షేత్రముకలదు ఆక్షేత్రముయొక్క ఊర్ధ్వభాగములో నారాయణగిరి అనుపర్వతము వెలంగుచున్నది నీవు అచ్చటికేగి అచ్చటవుండు స్వామి పుష్కరణిఅను సరోవరమునకు సమీపములో నుండు ఆకాశగంగలో స్నానంబుచేసినయెడల నీకు బలపరాక్రమశాలియగు పుత్రుడు జనించును అని ఆమునీశ్వరుడు చెప్పెను. తరువాత అంజనాదేవి అదేమేరకు ఆకాశగంగలో తపస్సుచేయగా వాయుదేవుడు ఈమెతపస్సుకుమెచ్చి ప్రతిదినం ఈమెకు ఫలహారమును యిచ్చుచుండెను. ఆమె ఆఫలములను ప్రతిదినం భక్షిస్తూ వుండగా వకరోజు వాయుదేవుడు తాను తెచ్చిన ఫలములో తన వీర్యమునువుంచి యిచ్చెను. అంజనాదేవి ఆఫలమును భక్షించగా గర్భము

ధరించెను. అందుకు ఆమె ఆశ్చర్యముతో ఏకాంగిగా తపస్సుచేస్తూ వుండిన తనకు యెట్లు గర్భముజనించినదని చింతించుచూయుండగా ఓసీ నీవు యేల చింతించెదవు నీకోరిక నెరవేరిపోయినదని ఆకాశవాణి చెప్పిన మాటవిని అంజనాదేవి ఆనందముతోనుండెను.

తరువాత అంజనాదేవి గర్భములో జనించిన శిశువు ప్రవర్ధమానుడై అతిబలపరాక్రమముతోనుండి మహాప్రకాశముగా వెలుగుచుండు సూర్యదేవుని యేదో వకఫలమని భ్రమించి సూర్యమండలమును కదిలింపనేగగ ఇంద్రుడుచూచి తన వజ్రాయుధముచే ఆబాలకుని కపాలప్రదేశమునందు తాడించెను. యీశిశువు ఆప్రహారమునకు తట్టుకోలేక మూర్ఛచెందెను. యీకృత్యమునుచూచి వాయుదేవుడు కోపించగా ఆభావమును చూచి ఇంద్రాదిదేవతలు వాయుదేవుని సమీపమునకేగి స్తుతించి మూర్ఛతోవుండిన బాలకునికి తెలివివచ్చినతరువాత వరంబులిచ్చి అంజనాదేవినిపిలిచి నీవు యీపర్వతముపై తపమును ఆచరించినందువల్ల యీపర్వతమునకు అంజనాద్రి అను నామధేయము వుండవలసినదని వచించె.

౩. ద్వాపరయుగములో శ్రీమహావిష్ణువున్నూ, లక్ష్మీదేవిన్నీ ఏకాంతముగా వుండదలచి ఆదిశేషునిజూచి ఓరీ నీవు ద్వారములోనే వుండి యెవ్వరినిన్నీ లోపల వదలకూడదని ఆజ్ఞాపించెను. ఆదిశేషుడు అదేమేరకు వర్తించుచుండగా వాయుదేవుడు శ్రీమహావిష్ణువుయొక్క దరుశనార్థముగావచ్చి విష్ణువుండిన ఏకాంతగృహమునకు ప్రవేశించుటకు యత్నించగా ఆదిశేషుడు అడ్డిచేయను వాయుదేవుడు కోపియై ఓరి దురాత్మా నిన్ను శపించెదనని చెప్పిన వాక్యమును విని శేషుడు క్రుద్ధుడై ఓరీ వాయుదేవ! భగవంతుడు నిద్రించుచుండు కారణముచే బట్టి నీవు యీసమయం అంతఃపురమునకు పోకూడదని చెప్పెను.



వీరిరువర్ల సంభాషణమును లక్ష్మీదేవివిని భగవంతునికి ఈసమాచారములను తెలిపె. అప్పుడు భగవంతుడు అంతఃపురమునుండి వీరివద్దకేగి ఆదిశేషునిజూచి యిది యేమికలహమని అడిగెను అందుకు ఆదిశేషుడు జరిగిన వృత్తాంతమును తెలిపెను. అనంతరము శ్రీమహావిష్ణువు వాయుదేవునిచూచి జరిగిన వృత్తాంతమును అడిగెను. ఇందుకు ఆదిశేషునికి కోపమువచ్చిన సమాచారమును భగవంతుడు ఆలోచించి ఆదిశేషుని గర్వభంగము చేయదలచి ఓరీ ఆదిశేష భూమండలమున వృషభగిరి అని వక పర్వతముకలదు నీవు అచ్చోటికేగి ఆపర్వతమును నీదేహముచే చుట్టుకొనియుండుము అప్పుడు వాయువు నిన్ను పారదోలిన యెడల అప్పుడు మీయిరువుర్లలో యెవరు బలపరాక్రమశాలియనునది వ్యక్తమగుచున్నదని వచించె. శేషుడు అదేమేరకు ఆపర్వతమును చుట్టుకొనియుండెను. వాయువు అచ్చోటికేగి తనపాదముయొక్క వక వ్రేలుతో ఆపర్వతమును కదలించి దూరముగా విసిరివేసెను. ఆదిశేషుడు యీపర్వతములో అంతర్ధానుడగుటచేత ఈపర్వతమునకు శేషాద్రిఅని పేరుకలదు.

4. కలియుగమున ఈపర్వతముమీద లోకరక్షకుడైన నారాయణమూర్తి శ్రీమహాలక్ష్మీసహితుడై నివసించుచూ సమస్తజనులకు మోక్షసామ్రాజ్యమును యిస్తూ వుండటముచే ఈలాటి జగద్రక్షకుడైన పరమాత్మునికి వాసస్థలమున్నూ, దర్శనమాత్రముచే పాపములన్నియు పోగొట్టు కారణమునుబట్టిన్ని ఈపర్వతమునకు వేంకటాద్రియని పేరుగలిగె

ఆదివరాహావతారము.

పూర్వకాలమందు శ్రీమహావిష్ణువుయొక్క నాభీకమలమువందు బ్రహ్మదేవుడు ఉద్భవించి ప్రపంచమును సృజించె శ్రీమహావిష్ణువు

అట్టి ప్రపంచములోని సృష్టిని సంరక్షణ చేయుచూరాగా బ్రహ్మదేవునికి నాలుగు వేలు యుగములు పూర్తి అయినవి అటుతరువాత బ్రహ్మదేవుడు నిద్రించెను. అప్పుడు ద్వాదశాదిత్యులు ప్రజ్వరిల్లి తన కిరణములతో అతి తీవ్రముగనుండిరి. సప్త వాయుపీవలు విజృంభించి వీవసాగెను. మేఘములొడ్డి వర్షము అపారముగా కురిసి జలప్రళయముకాగా ప్రపంచము సముద్రములో మునిగిపోయెను. యీప్రపంచమును హిరణ్యాక్షుడు పాతాళలోకమునకు తీసుకొనిపోయెను. ఇట్లుండ బ్రహ్మదేవుడు నిద్ర లేచిన కాలములో శ్రీమహావిష్ణువు వరాహావతారమును ధరించి సముద్రములోమునిగి భూమిని తెచ్చేకాలములో హిరణ్యాక్షుడు అడ్డమువచ్చి విష్ణువుతో యుద్ధము చేసి మృతినొందెను ఆసమయమున దేవాదిదేవతులు శ్రీమహావిష్ణువును స్తుతించిరి.

## గరుత్మంతుడు వైకుంఠములోనుంచి కిరీటమును తెచ్చుట.

భగవంతుడు గరుత్మంతునిచూచి ఓగరుత్మంత నేను హిరణ్యాక్షుని సంహారము చేసినందువల్ల నాశరీరమంతయు రక్తమయముగా వున్నది యిట్టి ఘోరరూపముతో నేను వైకుంఠమును కేగినయెడల శ్రీమహాలక్ష్మి నన్నుజూచి భయపడును గనుక నేను ఈభూలోకములోనే వుండిపోయెదను అని జెప్పెను. ఈవచనమును విని గరుత్మంతుడు స్వామి తమయొక్క ఈ భయంకరరూపమునుజూచి లక్ష్మిదేవి భయపడదు అని చెప్పెను. ఇందుకు శ్రీమహావిష్ణువు నేను భూలోకములో వుండి ధుష్టనిగ్రహ శిష్టపరిపాలన చేయదలచియున్నాను. కాన నీవు వైకుంఠమునకుపోయి శ్రీమహాలక్ష్మికిచెప్పి కిరీటపర్వతమును తెమ్ము అని ఆజ్ఞాపించెను గరుత్మంతుడు ఆజ్ఞాధారియై తక్షణం వైకుంఠమునకు



పోయి శ్రీమహాలక్ష్మికి శ్రీమన్నారాయణుని ఆజ్ఞను విన్నపించెను. అప్పుడు లక్ష్మిదేవి భగవంతునియొక్క రాకకు కారణమును గరుత్మంతునిద్వారావిని భగవంతుని అన్ని అవతారసమయములోనున్న నేనుకూడా వుండినాను గనుక ఈఅద్భుతఅవతారమును నేనుచూచి ఆనందించవలెనని తలచి తాను కిరీటపర్వతమునందు కూర్చుండెను. గరుత్మంతుడు ఆపర్వతమును భూలోకమునకు తెచ్చెను. అప్పుడు శ్రీమహావిష్ణువు ఆపర్వతమునకేగి లక్ష్మిసహితుడై వుండగా బ్రహ్మరుద్రాదిదేవతులు యావన్మందిన్నీ అచ్చటికేగి వరాహావతారము ధరించియుండిన శ్రీమహావిష్ణుకు సాష్టాంగ ప్రణామముజేసి దేవరవారు ఇప్పుడు ధరించియుండు భయంకరరూపమునుమాని శాంతరూపమును ధరించి లోకమును ఉద్ధరించవలెనని ప్రార్థించెను. శ్రీమహావిష్ణువు బ్రహ్మాదిదేవతుల ప్రార్థనను ఆలకించి తిరుమలలో ఆదివరాహమూర్తి అను నామధేయముతో సౌమ్యరూపముగా వేంచేసి భక్తుల అభీష్టములను నెరవేర్చుచూ విజయంచేశెను.

## నారదుండు కశ్యపాదిమునులవద్దకు పోవుట.

శ్రీమహావిష్ణువు శ్రీభూనీళా సహితుడై వైకుంఠములోనుండు నిత్యసూరులునుజూచి వార్లను ఆదరించవలెనని తలచి ప్రయాణసన్నద్ధుడుకాగా వేంకటాచలములోనుండు ఆదివరాహమూర్తి విశ్వకర్మనిచే నిర్మింపబడిన పట్టణమును విజయంచేసి స్వేచ్ఛావిహారిగానుండెను. ఈసంగతిని నారదుండు తెలుసుకొని తనతండ్రిఅయిన బ్రహ్మదేవునితో చెప్పెను. బ్రహ్మదేవుడు చింతించి శ్రీమహావిష్ణువు తన మహిమను భూలోకములో చూపించనియెడల నరులు భక్తిశ్రద్ధతో సత్కర్మములుచేయక పాపిష్ఠులగుదురు గనుక యేలాగైనను నీవు శ్రీహరిని పునః భూలోకమునకు రప్పించవలెనని నారదునికి బ్రహ్మదేవుడు చెప్పె. నారదుండు జాహ్నవి నదీతీరమునకువెళ్ళి అచ్చట

యజ్ఞము చేయుచుండిన కశ్యపాదిమునులనుజూచి ఓమునులారా మీరు చేయుచుండు యాగఫలమును యెవరికి ఇత్తురని అడిగెను. అందుకు ఆమునులకు యేమియు తోచక ఆలోచించుచూవుండగ నారదుండు త్రిమూర్తులపైకి సత్వగుణముకలవాడికి మీయజ్ఞఫలమును ఇవ్వవలెనని చెప్పి తాను త్రిలోకసంచారమునకు వెళ్లెను.

### భృగుమహాఋషి త్రిమూర్తులను శోధించుట.

తరువాత కశ్యపాదిమునులు త్రిమూర్తులలో సత్వగుణయుతులెవ్వా రెవరని తెలుసుకొనుటకై భృగుమహారిషిని పంపెను. ఈభృగురిషి సత్యలోకమునుకేగి బ్రహ్మదేవునిజూచి నమస్కారము జేసి బ్రహ్మదే వుని అనుజ్ఞపొందుటకుమునుపే తాను ఆసనములో కూర్చుండుటను జూచి బ్రహ్మదేవుడు ఆగ్రహామునుపొంది భృగునితో మాట్లాడక మవునముతోనుండగా భృగుముని బ్రహ్మదేవుడు రజోగుణసంపన్ను డని తెలుసుకొని అచ్చటినుండి కైలాసమునుకేగి అచ్చట పార్వతీ సహితుండైయుండిన శివుని అంతఃపురమునకుపోయెను. ఈకృత్యమును శివుడుచూచి నేను ఏకాంతముగా పార్వతీదేవితోవుండు సమయములో ఈభృగువు ముందాడిగా చెప్పిపనుపక అక్రమముగా నాయొక్క ఏకాంతగృహామునకు వచ్చినాడు అని కండ్లెర్రజేసుకొని కోపముతో వుండుటను భృగువుజూచి శివుడు తమోగుణ సంపన్నుడని తెలుసు కొని తరువాత వైకుంఠమునకేగి శ్రీమహావిష్ణువుయొక్క వక్షస్థల ప్రదేశమున తనపాదముతో తన్నెను అప్పుడు శ్రీమహావిష్ణువు కోపించక తనఆసనమునుండి లేచి భృగువుయొక్క పాదములను పట్టు కొని ఓమునివర్యా నన్నుతన్నిన ఈనీపాదములు ఎంతనొచ్చెనో అని పశ్చాత్తాపముతో శ్రీమహావిష్ణువు చెప్పిన ఉపచారవచనములకు భృగువు పరమ సంతుష్టుడై శ్రీమహావిష్ణువొక్కడే సత్వగుణ సంప న్నుడని తెలుసుకొని కశ్యపాదిమునులవద్దకేగి శ్రీమహావిష్ణువొక్కడే



సత్వగుణ సంపన్నుడని వార్లకు చెప్పినందువల్ల కశ్యపాదిఋషులంద రున్నూ తమ తపోబల మహిమలను శ్రీమహావిష్ణువుకు అర్పించి అన వరతమున్నూ శ్రీహరిధ్యానములోనే వుండిపోయిరి.

### లక్ష్మీదేవి శ్రీ హరితో కలహాము చేసుకొని కొల్లాపురమున చేరుట

భృగుమహాఋషి శ్రీమహావిష్ణువుయొక్క వక్షస్థలమునందు తన్నినందుకు వక్షస్థల వాసియగు శ్రీమహాలక్ష్మి కోపయుక్తురాలై భృగువుచేసిన అపరాధములకు విష్ణువు వారిని దండించుటకు బదులు వారిని సన్మానించినారని ఆక్రోశముతో వుండి భగవంతుడు యెంత సమాధానము చెప్పినను వినక శ్రీమహాలక్ష్మి వైకుంఠమునువదలి భూలోకములో కొల్లాపురం అను స్థలముచేరెను. అప్పుడు ఆవూరి లోనుండు భక్తాదులు ఈమెకు కొల్లాపురిలక్ష్మి అని నామధేయ మొసంగి భక్తితో పూజించుచుండెను. అది మొదలు ఈమె కొల్లాపుర మహాలక్ష్మిఅను నామధేయమును ధరించి భక్తాభీష్టములను ఇచ్చుచూ వెలుగుచుండెను.

### శ్రీమహావిష్ణువు భూలోకమునకు వచ్చుట.

ఇట్లు శ్రీమహావిష్ణువును విడిచి లక్ష్మిదేవియు వెళ్లిపోయినందున విష్ణువు అతి చింతాక్రాంతుడై యెట్లయిననూ లక్ష్మిదేవిని సంధించ వలెనని దలచి శ్రీమహావిష్ణువు వైకుంఠమువదలి తిరుపతి అను దివ్యక్షేత్రమునకువచ్చి అచ్చట బ్రహ్మదేవునిచే నిర్మింపబడిన ఒక పుట్టములో అణగియుండెను

### శ్రీహరి చోళరాజునకు శాపమిచ్చుట.

ఈసంగతిని లక్ష్మిదేవి తెలుసుకొని శ్రీమహావిష్ణువు తనకొరకై

భూలోకమునకు వచ్చియున్నారని దలచి పశ్చాత్తాపముతో వుండగా బ్రహ్మదేవుడున్నూ రుద్రుడున్నూ ఆవు దూడ రూపమునుధరించి లక్ష్మీదేవికి యెదురుగా నిలబడెను. వీరిరువర్ల రూపమునుజూచి లక్ష్మీదేవి మిక్కిలి సంతసించి తానుమనుష్యరూపమునుధరించి బ్రహ్మ రుద్రులను ఆవున్ను దూడనున్ను విక్రయించు నెపముతో చోళరాజుని నగరమునకు బోయెను. ఈపశువులను విక్రయించు సమాచారమును చోళరాజుని భార్యవిని ఈపశువులను తాను విక్రయమును తీసుకొన్నయెడల తనబిడ్డలుకు పాలుకు ఉపయోగపడుచున్నదని దలచి మానవరూపమును ధరించియుండిన లక్ష్మీదేవికి చోళరాజుని భార్య అపారద్రవ్యమునుఇచ్చి ఆపశువులను విక్రయమునకుతీసుకొని తనయొక్క గోపాలునిస్వాధీనం చేసెను. ఈగోవు ప్రతిదినమున్నూ శ్రీ వేంకటాచల పర్వతములో శ్రీమహావిష్ణువు వుండిన పుట్టవద్దకేగి తన క్షీరమంతయు ఆపుట్టలోవుండిన శ్రీమహావిష్ణువుకు అర్పించుచుండెను. ఈచర్యనుజూచి లక్ష్మీదేవి మిక్కిలి సంతోషించి కొల్లాపురమునకు బోయిచేరెను. ధేనువు ప్రతిదినం శ్రీమహావిష్ణువుకు క్షీరమునుఇచ్చుచూ గృహములో పాలుఇవ్వనందున చోళరాజునిభార్య గోపాలునిం జూచి ఓరి గోపాల ఇంతద్రవ్యమును బెట్టి తీసినపశువుకు పాలులేకపోవుటకు కారణమును కనిపెట్టి నాకు తెలుపవలెను. అని ఖండితమైన ఆజ్ఞచేశినందున గోపాలుడు దీనిరహస్యమును తెలుసుకొనవలెనని తలచి గోవువెంబడిపోయి ఆగోవు వేంకటాద్రి పర్వతముమీద కెక్కి అచ్చట వుండిన పుట్టవద్దకుపోయి అచ్చట క్షీరధారాపతనముచేసిన సందర్భమునుజూచి ఆగ్రహముతో తనచేతవుండిన గొడ్డలితో గోవును ప్రహరించెను. అప్పుడు శ్రీహరి తనకుప్రీతితో క్షీరమును ఇచ్చుచుండిన గోవును రక్షించవలెననిదలచి ఆగోపాలుని పరశు ప్రహారమునకు తనశిరస్సును జూపినందున ఆప్రహారము శ్రీహరికితగిలి రక్తప్రవాహము స్రవించెను. ఈరక్తమును జూచి గోపాలుడు భయపడి మృతి చెందెను. ఈసమాచారము చోళరాజునికితెలిసి రాజు తనపరివారముతో అచ్చోట రావడములో శ్రీహరి రాజునుజూచి నీవు పిశాచ



స్వరూపమును ధరించుము. అని శాపమొసంగెను. అప్పుడు చోళరాజుభయపడి తనశాపవిమోచనమునుగురించి శ్రీహరిని ప్రార్థించెను.

కలియుగాంత్యములో నీకు శాపవిమోచనం కలుగును అనిన్ని అప్పుడు తాను ఆకాశరాజుని పుత్రిని వివాహము చేసుకొనేదిగానున్ను, నవరత్నఖచితమగు కిరీటమును చేయించిఇచ్చిన యెడల ఆకిరీటమును ప్రతిశుక్రవారమున్నూ 6 ఘడియలకాలం తాను ధరించేదిగానున్నూ, ఆసమయములో మాత్రం శాపవిమోచనమయ్యేదిగానున్నూ శ్రీహరి వరమొసంగెను.

హరి వరాహస్వామిని సంధించుట.

శ్రీమహావిష్ణువు గోపాలునివల్ల తనకు ప్రహారము కలిగినందున తక్షణం బృహస్పతిని స్మరించి వారివలన చెప్పబడిన అప్రమధ సామగ్రీలును శేఖరించుకొరకై తానే బయిలుదేరెను.

అప్పుడు వరాహమూర్తిని సంధించి తాను జరిపినవృత్తాంతము యావత్తున్నూ వారికి తెలియచేయను వారు శ్రీహరికి కొంతస్థళమును ఇచ్చి తనకు వంటచేశిపెట్టుతూవుండిన వకుళమాలికాదేవిని శ్రీహరికి కూడా వంటచేసి ఉపచారముకొరకై యేర్పాటుచేసెను. అందువల్ల శ్రీహరి భక్తజనులకు నరరూపముతో దర్శనమును ఇస్తూ వారువారు ప్రార్థనారూపముగా సమర్పించే మొత్తములోనుంచి వరాహస్వామి వారు తనకుఇచ్చిన నేలయొక్క క్రయమునకుగాను చెల్లించుచ్చు లాగుననున్నూ ప్రతిదినమున్నూ శ్రీవరాహమూర్తికి పూజానైవేద్యములు జరిపించి తరువాత తాను పూజానైవేద్యములును జరుపుకొనే లాగుననున్నూ వప్పుకొనెను.

## వకుళమాలిక పూర్వవృత్తాంతము.

శ్రీమహావిష్ణువుకు వంటచేస్తూవుండిన వకుళమాలిక యెవ రనగా ద్వాపరయుగములో శ్రీకృష్ణుని పెంచిన యశోదాదేవిని బ్రంహదేవుడు ఒకస్త్రీరూపముగా సృజించి శ్రీవరాహమూర్తికి వంట చేసిపెట్టేలాగు యేర్పాటుచేసియుండెను. ఈ యశోదాదేవియే వకుళమాలిక.

## పద్మావతీదేవియొక్క జననం.

ఆకాశరాజను ఒకరాజు నారాయణపురమును యేలుచుండెను. ఇతడు ధరణీదేవిని వివాహముచేసుకొని బహుకాలమువర్కు తనకు పుత్రసంతానము లేకపోయినందున పుత్రకామేష్టియాగము చేయను నిశ్చయించి భూమిని దున్నించెను. అప్పుడు ఆభూమిలో సహస్రదళ పద్మముమీద రూపలావణ్యముకలిగిన ఒక స్త్రీశిశువునుజూచి చాలాసంతోసించి ఆశిశువును తనభార్యఅయిన ధరణిదేవివశం ఇచ్చి పద్మములో ఉద్భవించిన ఆశిశువుకు పద్మావతి అను నామధేయ మొసంగి చాలావిశ్వాసముతో ఈశిశువును పెంచుతూవుండెను.

## పద్మావతిదేవి పూర్వవృత్తాంత రహస్యము.

పూర్వము లంకాధీశుడైన రావణాసురుడు శీతాదేవినివంచించి దొంగలించుకొని పోతూవుండగా అగ్నిదేవుడు రావణాసురుడుకి యెదురుగావచ్చి ఓరీ! రావణాసురుడా, నీవుఇప్పుడు దొంగతనముతో తీసుకొని పోతూవుండు మనిషి నిజమైనశీతాదేవికాదు. నిజమైన శీతా



దేవిని శ్రీరామమూర్తి నావశమునఇచ్చిపోయెను. అనిచెప్పి వేదవతి అనుఆమెను నిజమైన శీతాదేవిఅనిచెప్పి రావణాసురునివశంచేశి నిజమైనశీతాదేవిని తానుదాచిపెట్టెను. శ్రీరామమూర్తి కపిసేనాసహితుడై లంకాపురీ ప్రవేశముచేశి రావణాసురునిజంపి అయోధ్యానగరమునకు ప్రయాణముచేసి అచ్చటి సీతాదేవిని అగ్నిప్రవేశము గావించెను. అప్పుడు ఆఅగ్నిలో ఇద్దరు సీతాదేవులుండగా నిజమైన సీతాదేవినిజూచి శ్రీరామమూర్తి దీనివృత్తాంతము ఏమిఅని అడిగినందుకు సీతాదేవి జరిగినవృత్తాంతమును శ్రీరామచంద్రునికి సవిస్తారముగా చెప్పి తనకుగాను లంకాపట్టణములో రావణునిచే అనేకకష్టములును అనుభవించిన వేదవతిని వివాహముచేసుకోవలెనని ప్రార్థించెను. అప్పుడు శ్రీరామమూర్తి తాను ఏకపత్నీవ్రతుడనియు కలియుగమున శ్రీవేంకటాచలములో అవతరించులాగునున్న అప్పుడు వేదవతిని వివాహముచేసుకొనేలాగుననున్నా చెప్పెను. ఆవేదవతియే పద్మములోవుద్భవించి పద్మావతిఅని నామధేయమును పొందెను.

## శ్రీవేంకటేశ్వరులు పద్మావతిని సంధించుట.

ఈ పద్మావతిదేవికి బాల్యముతీరి యవ్వనము ప్రాప్తమయి తన స్నేహితులుతోకూడా ఉద్యానవనములో పుష్పములుకోయ్యుటకుపోయి ఆవనములో విహరించుచుండెను. అప్పుడు నారదుండు ఆప్రదేశమునకువచ్చి పద్మావతికి సాముద్రికమును చెప్పేలాగు బోధించి పద్మావతియొక్క హస్తమునుజూచి నిన్ను శ్రీమహావిష్ణువు పెండ్లాడును అనిచెప్పి వెళ్ళిపోయెను. ఇట్లుండ ఒకదినం పుట్టములోవుండిన శ్రీమన్నారాయణమూర్తి అశ్వారూఢుండై రావడములో ఒకయేనుగ తనయెదురులోరాగా ఆఏనుగను తరుముతూ బహుదూరము వచ్చినందున ఏనుగ నిండాబడలి తన్నుతరుముతూవచ్చిన శ్రీమహావిష్ణువును జూచి తన్నుకాపాడవలెనని ప్రార్థించగా శ్రీమహావిష్ణువు ఆయేనుగ

యొక్క మొర నాలగించి దానిని రక్షించి అచ్చటవుండిన నందనవనములో కొంచెము విశ్రాంతిపొందనుద్దేశించి అచ్చటికిపోయెను. అప్పుడు ఆవనములో పుష్పసంగ్రహణము చేయుచుండిన పద్మావతిని జూచి మోహితుడై సమీపమునకుపోయి తన్ను వివాహము చేసుకోవలెనని ప్రార్థించెను. అప్పుడు పద్మావతి కోపించి తన చెలికత్తెలతోగూడి రాళ్ళచేరువ్వ నాదెబ్బలుకు తాళజాలక పరుగున పరుగిడి యీపద్మావతిచేసిన ఈసందర్భమును శ్రీమహావిష్ణువు చూచి తాను యథాప్రకారం పుట్టములోచేరి మోహపరవశుడై యుండెను.

## హరి కురవంజివేషము పూనుట.

ఇట్లు పుట్టములో ప్రవేశించిన శ్రీహరియు వకుళమాలికా దేవికి తనయొక్క అభిప్రాయమును తెలుపగా నామె శ్రీహరికోర్కెను యీడేర్చునట్లుగాచెప్పి శుభదినమున నారాయణపురమునకు ప్రయాణమాయెను. యీమె నారాయణపురము చేరకిమునుపే శ్రీలను పంపుటలో తనకోరిక నెరవేర్చునో నెరవేర్చదో అను సందేహముతో కొరవంజివేషమునుధరించి నారాయణపురమునకువచ్చి పనసుచెప్పు వారివలెనటించెను. ఇట్లుండ పద్మావతీదేవి నందనవనములో శ్రీహరిని చూచినదిమొదలు విరహతాపముతో పీడింపబడి ఆహారాదులను వర్జించి అత్యంతవ్యసనముతోనుండెను. ఆసమయములో ధరణీదేవి యొక్క పరిచారకులువచ్చి అమ్మా యెవరో పనసుచెప్పు ఆడమనిషి యొకటి యీవూరికివచ్చి వారివారికి పనుసుచెప్పుచున్నదని వరదీ చెప్పెను. యీసమాచారమును పద్మావతివిని తాను ఆమనిషిని జూచి తనమనోభావమును విచారించవలెనని తలచి తనదాసీజనులతో ఆకొరవంజిని తనవద్దకు పిలుచుకొనివచ్చేలాగు ఆజ్ఞాపించెను. అప్పుడు ఆదాసీజనులు ఆలస్యముచేయక తక్షణం ఆకొరవంజిని పిలుచుకొని



ధరణీదేవివద్ద వదలిరి. యీమాయామొగకలసాని తాంబూల దక్షిణమునుపెట్టి నాయొక్క మనసులో యున్న ఒక విషయమునుగురించి మొగుక చెప్పవలెనని చెప్పగా అప్పుడు ఆమాయామొగుకలసాని తన చేతనుండిన బెత్తమును ధరణీదేవిచేతనిచ్చి "విఘ్నేశ్వరా" వీరభద్ర మలయాళభగవతీ, మధుర మీనాక్షి, కంచి కామాక్షి, కనకదుర్గాంబా, శెలడాంబ, గియానాంబా, కొల్లాపురిలక్ష్మి, మీరందరున్ను నాకు తోడ్పడి వాక్యములివ్వండి అని కులదేవతలును ధ్యానముచేయుదానివలె నటించుతూ ధరణీదేవినిచూచి అమ్మా నీవు కోరిన కోరిక నెరవేరును నీవు ఒక ఆడబిడ్డనుగురించి పనసు అడుగుచున్నావు ఆడబిడ్డమనసులో ఒక తలంపు వుంచియున్నది ఆబిడ్డ నందనవనములో తన చెలికత్తెలతో విహరించుచుండగా ఒక దివ్యపురుషునిచూచి మోహించియున్నది అతడే శ్రీమన్నారాయణమూర్తి. మరివేరెవరున్ను కాదు అతనినే వివాహం చేసుకోవలయునని మోహపరవశురాలైయున్నది ఆయనన్ను యీబిడ్డను వివాహముచేసుకోను యిష్టపడియున్నాడు యీకారణమునుగురించే నీబిడ్డ విరహతాపమున పీడించుచున్నది నీబిడ్డను ఆయనకుయిచ్చి వివాహము చేసితే అన్నియు సుభమగును యీవిషయముగురించి వివాహప్రస్తావమును యేర్పాటు చేయను యింక కొంతసేపులో యిచ్చట ఒక ఆడమనిషివచ్చునని చెప్పి ధరణీదేవివద్ద సెలవుపుచ్చుకొని అచ్చటనుండి బయలుదేరి హరి వెంకటాచలము చేరెను.

వకుళమాలికయు నారాయణపురంబుచేరి ఆకాశరాజు గృహంబుచొచ్చి వివాహ ప్రయత్న అభిప్రాయమును రాజునకు విన్నవించెను. అందులకు ఆకాశరాజు మిగుల సంతోషమునవిని తన పురోహితులైన శుకయోగీంద్రుని పిలిపించి యతనిచే శ్రీవిష్ణుమూర్తికి వివాహ శుభలగ్న పత్రికను వ్రాయించి పంపెను. శ్రీ భగుడా శుభపత్రికను పుచ్చుకొని శుకమహర్షికి వందనములుచేసి యతనికి సెలవొసంగి వివాహఖర్చులకు కావలసిన ధనము సేకరించు

యుక్తి తోచక వెసనముతో నిండినవాడై వరహాస్వామిని కావలసిన ధనము అప్పుగనిమ్మని ప్రార్థించెను. ఈ ప్రార్థనను వరాహాస్వామి వొప్పుకొనని విధమున విష్ణుమూర్తి బ్రహ్మకును శివునికిని గరుడ శేషుల ద్వారా పెండ్లిపత్రికలను బనుప అష్టదిక్పాలకుల సమేతంబుగ బ్రహ్మ శివులు తమ పరిచారకులతో తక్షణమే సంతోషమున వేంకటాచలంబునకువచ్చి నారాయణపురంబున బంగారు రత్నములతో కట్టబడిన గృహంబును నిర్మింప విశ్వకర్మకు ఆజ్ఞాపింప విశ్వకర్మ వెంటనే శృంగారమగు గృహమును కట్టెను.

## శ్రీ వెంకటేస్వర పద్మావతిదేవి పరిణయ మహోత్సవ వైభవం.

అంతట విష్ణుమూర్తిని పెండ్లికొడుకునుచేసి నభ్యంగ స్నానమునకు లెండని సరస్వతి పార్వతి మొదలగు దేవాంగనలు వేడిరి. లక్ష్మిలేకనే నేను పెండ్లిస్నానము చేయనని విష్ణుమూర్తి పట్టుపట్టెను. అంతట విష్ణుమూర్తి ఆజ్ఞప్రకారంబున బ్రహ్మాదిదేవతలు కొల్లాపురము నుండి లక్ష్మీదేవిని తోడుకొని రమ్మని సూర్యుని ఆజ్ఞాపింప సూర్యుడు అతిత్వరతో కొల్లాపురంబునకేగి లక్ష్మిని పిలుచుకొనివచ్చెను.

లక్ష్మి వచ్చినదే విష్ణుమూర్తి పరమసంతోషముతో నిండినవాడై లక్ష్మీదేవిని కౌగలించుకొని యామె తన్ను విడిచినదిమొదలు తాను పడిన యిడుములను పెండ్లి ప్రయత్నములను లక్ష్మికివిశాలముగ చెప్పదొడంగెను. అప్పుడు పార్వతి, సరస్వతి, అరుంధతి, సావిత్రి మొదలగు పతివ్రతా శిరోమణులు శుభకార్యములను ఒనర్చిరి కుబేరాదులు విష్ణుమూర్తికి అనేక శుభకృత్యములను గావించిరి. అంతట బ్రహ్మాదులు శ్రీనివాసుని కులదేవతయగు శమీ వృక్షంబునకు నిండు భక్తితో పూజగావించి బ్రాహ్మణ సంతర్పణలు చేయించిరి. మరునాడు తెల్లవారుజామున శ్రీమన్నారాయణ పట్టణంబునకు బయలు



దేర తలచిరి. విష్ణుమూర్తి పెండ్లిశెలవులకుగాను ధనమును వూరికె తీసుకొనుటకు యిష్టపడక కుబేరునివద్ద అప్పుగ ద్రవ్యముయిమ్మని నిర్బంధపరుప, కుబేరుడు కోటి పదునాలుగులక్షల రామటెంకీలను శ్రీనివాసమూర్తికి నప్పిచ్చుటకు ఒప్పుకొనెను. సదరు అప్పుకుగాను సంవత్సరమునకు నెయ్య రామటెంకీలను వడ్డీగా నిచ్చునట్లు వొప్పుకొని అసలుపైకమును కలియుగ అంత్యమున నిచ్చునట్లు విష్ణుమూర్తి వొప్పుకొని త్రిమూర్తుల సమక్షమున కుబేరునిపేర అప్పుపత్రమును స్వంతలిఖితమున వ్రాసియిచ్చి త్రిమూర్తులను సాక్షులను వేయించి పైకమును పుచ్చుకొనెను. అటుతర్వాత పాత్రసామానులు, సంతర్పణకు కావలసిన వస్తువులను తయారుచేసి దివ్యమైన వంటలు పంచ భక్ష్య పరమాన్నములు చేయించి అహోబిల నరసింహస్వామికి మొట్ట మొదట నాగగింపు చేయించి పిమ్మట బ్రాహ్మణులు, దేవతులు, యోగీశ్వరులకు నెల్లగకును మనస్సుతృప్తిగా అన్నంబుపెట్టించి మరుదిన వుదయంబున మిక్కిలి ఆనంద వైభవముతో శ్రీమన్నారాయణ పురంబునకు బయలుదేరిరి. త్రోవమార్గంబున శుకయోగి యాశ్రమమునకు వచ్చిరి. శుకమహర్షి బహువైభవముతో పెండ్లివారినందరిని ఆదినము తనయాశ్రమమందుండునట్లు ప్రార్థించి సుఖమైన పంచభక్ష్య పరమాన్నములతో విందుపెట్టెను. మరునాడు తెల్లవారి శుకమునిం బిలుచుకొని యందఱును పెండ్లికి శ్రీమన్నారాయణపురంబునకేగిరి.

ఆకాశరాజు అతిసంతోషముతో నిండినవాడైయ్యెను. లక్ష్మీ శ్రీనివాసులను నగర ప్రదక్షిణంబుగా నూరేగింపు చేయించి పెండ్లి మండపమునకు పిలుచుకొని దివ్యసింహాసనమున గూర్చుండబెట్టెను. అంతట నిశ్చితార్థ శుభకార్యములను క్రమముగా జరిగించెను. ఆకాశ రాజు బ్రాహ్మణులకు దక్షిణలుయిచ్చి సంతృప్తిగా భోజనంబు పెట్టించెను. ఆరాజు అల్లునకు ముహూర్త కాలంబున వెలలేని రత్నములతో

పొసగిన బంగారు కిరీటము, వజ్రకవచము, మొలత్రాడు మొదలగు వెల లేని యాభరణములను యిచ్చెను. మహావైభవముతో పెండ్లి ముగిసెను.

విష్ణుమూర్తి కొన్ని దినములు అచ్చటనేవుండి తర్వాత వేంకటాచలంబునకు పద్మావతిని పిలుచుకొనిపోవు సమయంబున వంటసామానులను రత్నఖచితమగు భూషణములు ఆకాశరాజు పద్మావతికిచ్చి మహావైభవముతో పంపెను. శ్రీవిష్ణుమూర్తి లక్ష్మీదేవిని పద్మావతిని పిలుచుకొని చంద్రగిరి దుర్గమునందు అగస్త్యాశ్రమము చేరెను. పెండ్లి అయిన ఆరుమాసములు పర్వతము యెక్కకూడదని అగస్త్యమహాముని వచించెను. ఆరుమాసములు గడచునంతవరకు అగస్త్యాశ్రమమున శ్రీవిష్ణుమూర్తి లక్ష్మీదేవి పద్మావతితో నుండ నిశ్చయించెను.

శ్రీవిష్ణుమూర్తి పద్మావతితో అగస్త్యాశ్రమమునందు సంతోషముతో కాలము జరుపుచుండెను. మూడు నెలలకు పిదప ఆకాశరాజు మరణమొందెను. ఆకాశరాజు రాజ్యంబుకొఱకు ఆకాశరాజు కొమారుడగు వసుధానుండును తమ్ముడైన తొండమానుండును యుద్ధము చేయ తొడగిరి. ఇద్దరును శ్రీవిష్ణుమూర్తి సహాయముగోరిరి. శ్రీహరి తొండమానునకు తన చక్రాయుధము నిచ్చెను. వసుధానునకు తాను సహాయభూతుడై నిలచెను. ఉభయులకు భయంకరమగు యుద్ధము జరిగెను. ఇరుప్రక్కలవారును సమంబుగ పోరుచుండిరి. తొండమానుడు ఉత్కృష్టమగు చక్రాయుధంబును వసుధానునిపై వేసెను. చక్రి యడ్డంబు వచ్చెను కొంతసేపటికి మూర్ఛజెందిన తొండమానుండు లేచి సాష్టాంగ ప్రణామంబు శ్రీమన్నారాయణమూర్తికి లాచరించెను. నేను మహాపాప కార్యంబు జేసితిని నేను రాజ్యపరిపాల



నము చేయజాలను. పాపకృత్యమును పోగొట్టుకొనుటకై కాశీయాత్రకు పోయెదను. వసుధానునకు రాజ్యపట్టాభిషేకంబు కట్టుడని శ్రీహరితో తొండమానుండు చెప్పెను. వసుధానుడు నాకొఱకై మీరు బహు కష్టపడితిరి. నేను రాజ్యపరిపాలనము చేయను. నా పాప విమోచనకై రామేశ్వరము బోయెదను. తొండమానునికే రాజ్యమును పట్టాభిషేకము చేయమని చెప్పెను. శ్రీహరికి యేమియు దోచక అగస్త్య శుకమహర్షుల పిలిపించి తొండమానునికి, వసుధానునకును గల తగవులను పరిష్కారము చేయుమని చెప్పెను. అట్లనే అగస్త్య శుకమహర్షులవారు యిరువురులకును సరిసగము రాజ్యము నిచ్చునట్లు నిర్ధారణ చేసిరి. శ్రీహరి అందులకు భరితాంతరంగుడై అగస్త్యాశ్రమమునకు వెళ్ళి పద్మావతితో సుఖంబుననుండెను.

అదిమొదలుకొని తొండమాన్-వసుధానులు తమ రాజ్యములను పాలించుచుండిరి. తొండమానుండు మిక్కిలి భక్తితో అగస్త్యాశ్రమంబు చేరి విష్ణుమూర్తిని ప్రతిదినము బంగారు పుష్పములతో పూజించుచుండెను. తొండమానుని భక్తికిమెచ్చి హృషీకేశుడు తన నిజ విశ్వరూపమును నతనికి చూపించెను. అప్పుడు తొండమానుడు మిక్కిలి సంతోషముతో నిండినవాడాయెను. ఇప్పటినుంచి నేను వేంకటాచలంబు చేరి మనుజుల కోరికలను పూర్తి చేయుచుండెద. నీవు తక్షణమే విశ్వకర్మను పిలుచుకొని వేంకటాచలంబునకేగి నాకు సువర్ణ రత్నమయమగు దేవాలయంబు కట్టిరమ్ము అని సెలవొసంగెను. నీవు అతిభక్తుండవై నాకు భక్తి నలుపుచు బావిని త్రవ్వించి చక్కగా కట్టుము అని ఆజ్ఞాపించెను. అట్లనే తొండమానుండు ఆమాటలను పరమానందముగా గైకొని యాబావిని కట్టించి మూడు ప్రాకారంబులను, రెండు గోపురములను, సప్త ద్వారంబులను, దానికి కావలసిన మంటపములును, దానిపై బంగారు కలశంబును నిర్మించి, పెద్ద వీధులును, వీధులలో అక్కడక్కడ మంటపంబుల నేర్పరచి కావలశిన

వంటసామానులను నింపి అక్కడనుంచి అగస్త్యాశ్రమంబుచేరి శ్రీని
వాసమూర్తికి విన్నవించెను. శ్రీనివాసమూర్తి పద్మావతీసమేతుడై
వేంకటాచలా పర్వతారోహణముచేసి మంచిలగ్నమందు నూత
నముగా కట్టబడిన మందిరంబున ప్రవేశించి అందరికిని సంతోష మొన
రించుచుండెను. బ్రహ్మ శ్రీనివాసమూర్తి సన్నిధిలో అఖండంబు
నిర్మించెను. అఖండం బెంత కాలము నుండుచుండునో నంత కాలము
విష్ణుమూర్తి యచ్చట నివసించుచుండును. కలియుగ అంత్యమున నా
యఖండం బారిపోవును. అప్పుడు శ్రీనివాసమూర్తి భూలోకంబును
విడిచి వైకుంఠంబునకేగునని వచించెను. శ్రీనివాసమూర్తికి ప్రతి
సంవత్సరమున్ను మిక్కిలి వైభవముతో బ్రహ్మోత్సవము జరిపించు
చుండుమని తొండమాన్ చక్రవర్తికిచెప్పి తాను సత్యలోకంబున
కేగెను. అదేప్రకారము భగవంతునికి తొండమాన్ చక్రవర్తి అతి
భక్తితో ఉత్సవములను జరిపించుచుండె.

కూర్మడను బ్రాహ్మణుండొకదినంబున గర్భముతోనుండిన
తన భార్యను, కుమారుని పిలుచుకొని కాశీయాత్రకు పోవుచుండె
తన మార్గమధ్యంబున తొండమాన్ చక్రవర్తిని సంధించి అతడు
వుండు స్థళమునకువచ్చి తనసతియొక్క స్థితిని తొండమాన్ చక్రవర్తి
కెఱింగించెను. యేమనిన తాను కాశీయాత్రపోయి మరల వచ్చు
వఱకు తనభార్యను, పుత్రుని కాపాడుచుండుమని చెప్పి వారిరువర్లను
తొండమాన్ చక్రవర్తి కొప్పగించి తాను కాశీయాత్రకు వెళ్లెను. అదే
ప్రకారము తొండమాన్ చక్రవర్తి నాబ్రాహ్మణుని భార్యను, కుమా
రుని ప్రత్యేకమైన ఒకయింటిలో వుండుమని తన పరిచారకులతో
ఏర్పాటుచేసి వారిరువర్లకు కావలసిన సామగ్రులనిచ్చి కాపాడు
చుండెను. ఇట్లు వారు కాపాడుచుండ నాబ్రాహ్మణునిభార్య ఒక
కుమారునిని తీర్థమాడెను. ఆబ్రాహ్మణునిభార్యను బిడ్డలిద్దరిని రాజు
కాపాడుచుండెను. ఇట్లుండ కొంతకాలమునకు తర్వాత ఎవరో వార్లు



నివసించుచుండిన యిల్లుయొక్క బయటి తలుపు గడియను వేసి
వేసిరి. అట్లుండ తొండమాన్ చక్రవర్తి వారి జీవనవిషమై మరచి
యుండెను. ఆగృహములోనుండిన బ్రాహ్మణునిభార్యయును యిద్దరు
శిశువులును అన్నఆహారములేక చనిపోయిరి. కొంతకాలమునకు
తర్వాత నాబ్రాహ్మణుడు కాశీయాత్ర సేవించుకొని మఱలి తొండ
మాన్ చక్రవర్తి యాశ్రమంబునకువచ్చి చేరెను. వచ్చి చేరినతర్వాత
నాబ్రాహ్మణునికి భార్యను బిడ్డలను జూడవలయుననికోరి తొండమాన్
చక్రవర్తిని అడిగెను. అదేప్రకారము తొండమాన్ చక్రవర్తి తన
సేవకులను పిలిచి ఆబ్రాహ్మణుని భార్యను, బిడ్డలను పిలుచుకొని
రమ్మని ప్రుత్తరవుచేసెను. తొండమాన్ చక్రవర్తి సేవకులు గృహ
ములో పోయిచూడ అక్కడ జరిగియుండిన ప్రమాదమును తొండ
మాన్ చక్రవర్తితో జెప్పిరి. ఆప్రమాద సంగతిని రాజు తొండ
మాన్ చక్రవర్తి వినినవెంటనే దిగ్భ్రమజెందినవాడై యేమియుం
దోచనివాడాయెను. వెంటనే తొండమాన్ చక్రవర్తి వేంకటేశుని
సన్నిధానంబుచేరి తనకు సంభవించిన విపత్తును తొలగింపుమని
శరణాగతుడాయెను. దయారసముగల నావృత్తమపురుషుండైన శ్రీవేం
కటమూర్తి తొండమాన్ చక్రవర్తికి సంభవించిన ఆపదను తొలగించుట
కై నాబ్రాహ్మణ కళేబరములను తెప్పించి వేంకటేశుని పుష్కరిణికి
తూర్పుతట్టుననున్న తీర్థంబున ముంచినవెంటనే నాబ్రాహ్మణ శవ
ములు వెంటనే ప్రాణముతో నిండినవారైరి.

పిదప శ్రీవేంకటేశమూర్తి తనగుడిలోచేరి వ్యసనముతో
నిండినవాడై యికమీదట మనుజులతో సంభాషణముచేయుటచేత
నిటువంటి యిడుములకు కారణమాయెనుగదా యని విసిగెను. అది
మొదలు మనుష్యులకు ప్రత్యక్షముకాకపోయెను. మనుజులయొక్క
కోరికెలను కలలోవచ్చి వెలిపెదనని నిర్ధారణచేసుకొని మౌనముద్ర
ధరించెను. కొంతకాలమిట్లు తొండమాన్ చక్రవర్తి శ్రీవేంకటేశుని

పూజించుచు తనకుమారుడైన శ్రీనివాసునకు రాజ్యపట్టాభిషేకము చేయించి తాను వేంకటపర్వతముచేరి తపస్సుచేసి మోక్షపదవి పొందెను. తొండమాన్ చక్రవర్తికొమారుడు శ్రీనివాసుడును-వసుధానుడును శ్రీవేంకటపెరుమాళ్లకు అనేక ఉత్సవములను పూజలను జరుపుచుండిరి. అది మొదలుకొని శ్రీవేంకటరమణుడు భక్తులకు మాత్రము కలలో అగుపడుచు భక్తుల కోరికలను నెరవేర్చుచు బ్రహ్మజ్ఞాన నిష్టపరులకుమాత్రము దర్శనమిచ్చుచుండెను,

మరియు నీపర్వతమునకు అనేక నామములుగలవు. అవి యేవనిన (1) గరుడాద్రి, (2) నరసింహగిరి, (3) నారాయణాద్రి, (4) కనకాచలము, (5) శ్రీనివాసపర్వతము, (6) ఆనందాచలము అని పేర్లుగలవు. కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగంబులలో నీపర్వతము బంగారుమయమై ప్రకాశించుచుండె. ఇప్పుడు కలియుగంబున రాతిమయమై యున్నది. ఈకలియుగంబునకూడ యోగీశ్వరులకు, మునులకు, జ్ఞానులకు, తపోనిధులకు బంగారుమయముగానే అగపడుచుండును.

### వేంకటాచలయాత్రచేసి కడతేరినవారు.

ఈపర్వతమున పుణ్యతీర్థములలో స్నానమొనరించి స్వామివారి దర్శనముచేసి కడతేరినవారు అనేక యోగీశ్వరులు గలరు వారిలో గొందఱిని నిందువివరించెద. కుమారస్వామి తారకాసురుండను బ్రహ్మరాక్షసునిచంపి ఆబ్రహ్మహత్యా దోష విడుదలకొఱకు వేంకటాచలంబున కేగి పర్వతారోహణము చేయుటకు ముందరనే బ్రహ్మ



హత్య యతనిం విడిచిపోయెను. అటుతర్వాత కుమారస్వామి వేంకటాచలంబున కేగి స్వామి పుష్కరిణి కుమారధారా తీర్థములందు స్నానము చేసి వరాహస్వామిని సేవించి మోక్షితుండయ్యె. అదేమాదిరి బలరాముడు, బ్రంహ్మేంద్రాది దేవతలును, మార్కండేయ, అగస్త్య, గౌతమాంగీరస, శౌనక, వసిష్ఠ సనకసనందనాది ఋషులును వేంకటాచలంబున నిష్ఠలుచేసి శ్రీవిష్ణుమూర్తిని సేవించి తమకోరికలను సంపూర్తిచేసుకొనిరి. అంజనాదేవి వేంకటాచలంబున కేగి ఆకాశగంగ యను తీర్థమునకు సమీపమున ఆశ్రమమేర్పరచుకొని శ్రీమన్నారాయణునిగూర్చి తపమాచరించెను. ఆతపస్సువలన శ్రీరాములవారి అతిభక్తుండగు ఆంజనేయులవారిని దర్శించెను. ధశరధ మహారాజు పుత్రసంతానముకొఱకు స్వామి పుష్కరిణీవద్ద తపస్సుచేసి యాతపోబల ప్రభావంబున శ్రీరామలక్ష్మణ భరత శత్రుఘ్నులను నలుగురు కొమరులు కలిగిరి. కాంభోజదేశపు చక్రవర్తి రాజ్యంబును పోగొట్టుకొని శ్రీవేంకటాచలంబున కేగి పుణ్యతీర్థంబులలోమునిగి శ్రీనివాసుని సేవించినతర్వాత తనరాజ్యమును మరల సంపాదించుకొనెను. మాధవుడను బ్రాహ్మణుడు పంచమజాతి స్త్రీసంభోగముచేత కలిగిన మహాపాపమును శ్రీవేంకటాచలమూర్తిచే పోగొట్టుకొని జన్మము సాఫల్యము చేసుకొనెను. ఇంకయు జనకమహారాజు, తిరుమలనంబి, ఆనందాళ్వారు, రంగదాసుడు, కురువనంబి, లోనుగాగల మహాభక్తులు వేంకటాద్రియందలి పుణ్యతీర్థములలో స్నానముచేసి మోక్షము పొందిరి.

వేంకటపతిరాయులు, వేంకటదేవరాయులు, కృష్ణరాయులు వీరలు శ్రీగోవిందునిసేవించి, వారికి కొన్ని దేవాలయములను నిర్మించి, కొన్ని వెలలేని రత్నములతో పొదిగించిన యాభరణములను సమర్పించిరి. ఇప్పటికికూడా కృష్ణదేవరాయులు, వేంకటపతిరాయులు వీర్ల విగ్రహములు గోపురమునకు లోతట్టున స్థాపింపబడియున్నవి.

## శ్రీ వేంకటాచలమునందలి పుణ్యతీర్థములు

శ్రీ వేంకటాచల పర్వతరత్నంబున 108 పుణ్యతీర్థములున్నవి వాటిలో ప్రసిద్ధిజెందినవి యేవనగా. (1) స్వామి పుష్కరణితీర్థము, (2) వరాహ పుష్కరిణీతీర్థము, (3) ఆకాశగంగతీర్థము, (4) పాపవినాశనముతీర్థము, (5) కుమారధారతీర్థము, (6) పాండుతీర్థము, (7) గోగర్భముతీర్థము, (8) కపిలధారతీర్థము, (9) తుంబురుకోనతీర్థము, (10) రసాయనీతీర్థము, (11) జాబాలితీర్థము, (12) రామకృష్ణతీర్థము, (13) అస్థితీర్థము, (14) సనకసనందతీర్థము, (15) కటాహతీర్థము, (16) విరజానదితీర్థము.

(1) శ్రీస్వామి పుష్కరిణి, (2) వరాహతీర్థములు రెండును నొకచోటనే యున్నవి. వరాహస్వామివారిగుడికి తూర్పున వరాహతీర్థమున్నది. వరాహతీర్థమునకు దక్షిణభాగంబున శ్రీస్వామి పుష్కరిణీ తీర్థమున్నది. వరుషాకాలంబున నీరెండుతీర్థంబులు యొకటిగానే అగుపడును. నీరెండుతీర్థములును చేర్చి స్వామి పుష్కరిణియని వాడుచున్నారు. నీరు నింకిపోయినకాలమందు అనగా వరుషములు కురియని కాలమందు నీరెండు తీర్థములు వేఱు వేఱుగా నగుపడుచున్నవి. స్వామి పుష్కరిణిలో మన్ను యెత్తి శుద్ధిచేసినప్పుడు అడుగుభాగంబున తొమ్మిది తీర్థములు అగుపడెను. అందులో తిరుమణి, తిరుచూర్ణము, విభూతి, గోపిచందనము మొదలగు నానావిధ రంగులైన మట్టియు సాలగ్రామమును నగపడెను.

అతొమ్మిదితీర్థముల నామము లేవియనిన:—

(1) కుబేరతీర్థము, (2) గాలవతీర్థము, (3) మార్కండేయ తీర్థము, (4) అగ్నితీర్థము, (5) యమతీర్థము, (6) వసిష్ఠతీర్థము, (7) వ-



రుణతీర్థము, (8) వాయుతీర్థము, (9) సరస్వతితీర్థము. యీతొమ్మిది తీర్థములు తొమ్మిది ఋషులచే నిర్మితంబయ్యె. వారినామధేయము లేవియన (1) ధనదనుడు, (2) గాలవఋషి, (3) మార్కండఋషి, (4) అగ్నిదేవుడు, (5) యముడు, (6) వసిష్ఠులు, (7) వరుణుడు, (8) వాయుదేవుడు, (9) సరస్వతీదేవి. యీనవపుణ్యతీర్థములలో స్నానము చేయువారికి మరల జన్మములేదని పురాణములు మొరలిడుచున్నవి. యీపుణ్యతీర్థముల ప్రభావమును వర్ణింప ఇంద్రాదిదేవతలకును శక్యముకానేరదు. స్వామి పుష్కరిణి వరాహతీర్థములలో స్నానముచేయువారికి బ్రహ్మహత్యాదిదోషములును, పూర్వముచేసిన కర్మములను నశించిపోవుటకు సందిహాము లేదు.

వర్షంబున కొక్కతూరి ధనుర్మాసమున శుక్లపక్షమి ద్వాదశి యందు ప్రాతఃకాలంబున భరతఖండంబునంగల గంగానది అనేక పుణ్యనదులును స్వామితీర్థంబున గలియును. ఆదినంబున స్వామితీర్థంబున స్నానముచేయువారికి చెప్పగూడనటువంటి పుణ్యము కలుగునని పురాణ మొరలిడుచున్నది. నాపుణ్యదినంబున స్వామితీర్థంబున ముందరోజుకంటె రెండుమూడుమెట్లు అధికముగ నీరుండును.

### పాపవినాశనతీర్థము.

ఇది శ్రీవేంకటేశునిగుడి కుత్తరమున మూడుమైళ్లదూరమున నున్నది. ఇందులో యెడతెగక గంగ వుండును. ఈతీర్థమునందు స్నానముచేయువారు వారిపాపముకొలది నీరు మురికగుచుండును. పుణ్యపురుషులు స్నానముచేయునపుడు నీరు శుభ్రముగనుండును. ఈ తీర్థమునుండి పూర్వకాలమున తోళప్పాచార్యుల వంశస్థుడగు తిరుమలకుమార తిరుమలనంబి శ్రీవేంకటేశుని యారాధనకు తీర్థము దెచ్చుచుండెను. ఈపాపవినాశనతీర్థములో స్నానముచేయువారు ప్రా-

హత్యాది దోషములు చేసియుండినప్పటికిన్ని విమోచనమవునని పురాణప్రసిద్ధి. నీతీర్థస్నానము అశ్వయుజ శుద్ధసప్తమి ఆదివారంబున అపారఫలమునిచ్చును.

### ఆకాశగంగతీర్థము.

ఇది శ్రీవేంకటేశుని యాలయంబున కుత్తరంబున రెండు మైళ్లు దూరములోనున్నది. శఠమర్షన గోత్రుండను తోళప్పాచార్యుల వంశస్థుడగు తిరుమలకూర తిరుమలనంబియను భక్తుడు ప్రతిదినము పాపవినాశనమునుండి తీర్థమును శ్రీవేంకటేశునివారి పూజకైంకర్యములకు తెచ్చుచుండెను. ఆకాలమందు తిరుమలకుమార తిరుమలనంబియొక్క సద్భక్తికిమెచ్చి యతనికి వేంకటేశ్వర్లు ప్రసన్నుండయ్యెను. అప్పుడు నంతికంటె సమీపంబున వియద్గంగనుండి గలుగ జేసిన తీర్థమునే తనపూజ కైంకర్య యారాధనకు దెమ్మని తిరుమల నంబికి ఆజ్ఞాపించెను. అప్పటినుంచి తిరుమలనంబి ఆకాశగంగ తీర్థమునే తెచ్చుచువచ్చెను. నేటిదినమునకుకూడా తిరుమలనంబి సంతతివారు ఆకాశగంగనుండియే తీర్థమును స్వామివారి యారాధనకు దెచ్చుచున్నారు. శ్రీవేంకటేశులవారికి పూజకాలమందు తిరుమల నంబొనరించిన మంత్రపుష్ప కైంకర్య మిప్పటికిని జరుగుచున్నది. తిరుమల కుమార తిరుమలనంబికి దిగువతిరుపతియందు గోవిందరాజస్వామివారి ఆలయమునందు గుడికట్టబడి ఉత్సవపూజలు జరుగుచున్నవి. ఆకాశ గంగకుదగ్గర అంజనాదేవి యాశ్రమమేర్పరచుకొని నిష్ఠసలిపెను. దీని యందొక ఆశ్చర్యమొకటిగలదు. ఈతీర్థధార యొక బ్రహ్మాండమగు బండలోనుంచి పుట్టుచున్నది. ఆబండపై జనులు నడుచుచున్నారు. ఆబండమీద నీటియాధారమేమియు లేదు.



గంగ యెక్కడనుంచివచ్చునో అగుపడుటలేదు. యీనీటిధార సర్వకాలములందుండును. యీనీటిధారయందు స్నానముచేయువారికి [illegible] ఫలము లభించునని పురాణములు చెప్పుచున్నవి. చైత్రశుద్ధ పున్నమినాడు యీగంగయందు స్నానముచేయువారికి విశేషపుణ్యములభించును.

### కుమారధారాతీర్థము.

ఈకుమార ధారాతీర్థము పాపవినాశనమునకు వాయువ్యమూలయందు వేంకటాచలమునకు 8 మైళ్లు దూరములోనున్నది యీతీర్థమునందు కుమారస్వామి తారకాసురుని చంపిన బ్రహ్మహత్యా పాపమును పోగొట్టుకొనుటకు నీతీర్థస్నానంచేసినందున పాపము బోగొట్టుకొనెను. పూర్వకాలంబున నొక ముసలిబ్రాహ్మణుడు తన కొడుకును దారపోసుకొని తిరుమలకువచ్చి యచట విచారపడుచుండ శ్రీమన్నారాయణమూర్తి నాముసలిబ్రాహ్మణునికి బ్రత్యక్షమై యతని నీతీర్థమున స్నానంజేయుమనిచెప్ప నతడు వెంటనే స్నానంచేయునంతలో పదునారు సంవత్సరముల బాలుడై తనకుమారునింగాంచె. ఈతీర్థస్నానమున ముసలివాడు బాలకుమారుడైన విధంబున నీతీర్థమునకు కుమారధారాతీర్థమని నామముకలిగెను. యీతీర్థమునందు మాఘశుద్ధమి దినంబున స్నానము ముఖ్యముచే ముఖ్యఫలమునిచ్చును.

### పాండవతీర్థము.

ఇది శ్రీవేంకటేశుని యాలయంబునకు నొకమైలు దూరమున నున్నది. దీనిగట్టున పంచపాండవులు నిష్ఠలుచేసి దీనియందు స్నాన

మాచరించి దుర్యోధనాదులతో యుద్ధమున జయముపొందిరి. దీనికి దృష్టాంతరముగా యిప్పటికిని ధర్మరాజాదుల శిలావిగ్రహములు గలవు. యీపంచపాండవులవలననే యీతీర్థమునకు పాండవతీర్థమని పేరు కలిగెను. దీనియందు స్నానముచేయువారికి పాపముపోవును. శత్రు జయమును గలుగును. మంగళవారముతో చేరిన వైశాఖబహుళ ద్వాదశిదినములందు పాండవతీర్థమున స్నానముచే ముఖ్యఫలము.

## గోగర్భతీర్థము.

గోగర్భతీర్థము పాండవతీర్థమునకు దగ్గరనున్నది. ఈతీర్థము ఆవురూపమున స్థాపింపబడియుండు ద్వారములో దూరి పారుచున్నది. గోగర్భతీర్థమునకును పాండవ తీర్థమునకును దగ్గర క్షేత్రపాలకగుండు అను నామధేయముతో నెప్పు పెద్దనల్లని గుండురాయి యొకటిగలదు. తగరార్లు యేర్పడినచో మనుష్యులీగుండుదగ్గరకువచ్చి తమతగరార్లను పైసలు చేసుకొనుచున్నారు. దీనిచే తగరార్లును పైసలుచేసుకొనుటకు దలచినవార్లు గోగర్భములో స్నానముచేసి తడిబట్టలతో నీగుండు దగ్గరికిపోయి దానినితాకి సత్యమాటలనుపలికిన లాభమతసిది. దీనికి సాహసించుట కనేకులు భీతిజెందుదురు. ఇటువంటి తగరార్లను తీర్చుకోదలంచినవారు దేవాలయమునకు కానుకకట్టి దేవస్థానాది కారుల ఆజ్ఞను పొందవలెను.

## తుంబురుకోనతీర్థము.

తుంబురుకోనతీర్థము శ్రీ వేంకటాచలమునకు ఉత్తరభాగంబున రమారమి పదునాలుగు లేక పదునేను మైళ్లు దూరముననున్నది. తుంబురుమహర్షి నరలోకంబున తిరుగుచు నరస్తుతి చేయ నతనికి



విమానభ్రష్టత్వము కాగా నతడు తుంబురుకోనతీర్థములో స్నానము చేయ నతని విమానభంగముపోయి దేవలోకసంచారమునకు తగిన వాడై విమానమునుపొందెను. తుంబురుకోన తీర్థమునందు స్నానము చేయువారికి మరల జన్మములేదు. యీతీర్థమునకు ఫాల్గుణశుద్ధ పౌర్ణమిదినంబున స్నానమాచరించుట విశేషము. శ్రీరామాదులు వనవాసము సల్పునపుడీచోటికిరాగా శీత దాహమునకు తాళలేక పరమేశ్వరుని వేడ నతడు యీతీర్థమును తనవిల్లుచే కలుగచేసెనని పెద్దలు చెప్పుచున్నారు.

## రసాయనతీర్థము.

రసాయనతీర్థమునకు కాయరసాయనతీర్థమని నామధేయముకద్దు. రసాయనతీర్థము పాపవినాశనమున కుత్తరముననున్నది. రసాయన తీర్థ విచిత్రమేమనగా యిందులో తెల్లని ఆకును వేసినయడల అది రంగుమారి నల్లనగుననియు, దీనిరహస్యమును సనకాది మహాఋషులు మరుగుపఱచిరనియు, మహాత్ములకును, యోగీశ్వరులకును, తపోనిధులకునుమాత్రము యగపడుననియు పురాణములో చెప్పబడుచున్నది. రసాయనతీర్థములో స్నానముచేయువారికి అష్టయిశ్వర్యములు గలుగును.

## రామకృష్ణతీర్థము.

రామకృష్ణతీర్థము శ్రీవేంకటాచలమునకు తూర్పుతట్టున ఎనిమిదిమైళ్లు దూరముననున్నది. పూర్వకాలమున రామకృష్ణుడను మునిశ్రేష్ఠుడు దీనిదగ్గర వేలకొలది సంవత్సరములు ఉత్కృష్టమైన తపస్సునలిపెను. అటువంటి పరమతపస్సువల్ల అతని దేహమున

పుట్టలుకట్టెను. ఇంద్రుడు రామకృష్ణుడను మునిశ్రేష్ఠుని భక్తిని పరిశీలించుటకై యేడుదినములు భయంకరమగు, అపారమగు వర్షమును గురియింపజేసెను. వల్మీకములు కరిగిపోయెను. ఋషితపంబు చలింపదయ్యె. అంతట శ్రీవిష్ణుమూర్తి రామకృష్ణుడను మునిశ్రేష్ఠుని యొక్క భక్తికిమెచ్చి ప్రత్యక్షమై తానావిర్భవించిన దినమగు పుష్య శుద్ధ పౌర్ణమిదినంబు నీతీర్థంబున స్నానముచేయువారికి సకల పాపములు పోవుననియును, తాముకోరిన కోరికల నెరవేరుననియు చెప్పి ఆతీర్థమునకు రామకృష్ణతీర్థమను పేరునుబెట్టి మరుగయ్యెను. ఇదియునుంగాక తల్లి, తండ్రి, గురువులను నిందచేశినవారు యీతీర్థములో స్నానముచేసినయెడల వార్లుచేసిన పాపములనుండి తొలగింపబడుదురు.

## జాబాలితీర్థము.

---

జాబాలితీర్థము ఆకాశగంగకు సమీపముననున్నది. జాబాల మహర్షి దీనివద్దున తపస్సుచేసినందున దీనికీపేరుగలిగెను. పూర్వము దురాచారుడను పేరుగల బ్రాహ్మణుడొకడు గ్రహముచే పీడింపబడినవాడై దేశదేశములు సంచరించుచుండెను. అకస్మాత్తుగ నా బ్రాహ్మణుడు నీతీర్థమునుజేరి జాబాలఋషినిచూచి తనయిడుములను జెప్పుకొనెను. నప్పుడీతీర్థమహిమను ఆబ్రాహ్మణునకు తెల్పెను. అంత నాబ్రాహ్మణుడీతీర్థంబున కొన్నిరోజులు స్నానంబుచేసి సర్వపాపంబులను బోగొట్టుకొని పరమపదవినిసింబొందెను.

## అస్థితీర్థము:—సనకసనందతీర్థము.

---

అస్థితీర్థము తిరుమలపురికి తూర్పుదిక్కున హెచ్చు తక్కువ రెండుమైళ్ళ దూరముననున్నది. ద్వాదశి తిథియందు దీనియందు



స్నానముచేసినయెడల విశేషఫలమును అష్టయిశ్వర్యములొసంగును.

సనకసనందతీర్థము పాపవినాశనమున కుత్తరభాగంబు నొక మైలుదూరముననున్నది. యీ తీర్థమునందలి స్నానమాచరించిన యెడల అనేక భంగములకును పరిహారము. యీతీర్థమునందు మార్గశీర్ష శుద్ధ త్రయోదశిదినంబున స్నానము విశేషము.

## కటాహతీర్థము.

---

కటాహతీర్థమునే తొట్టితీర్థమని చెప్పుదురు. ఇది శ్రీవారి యాలయములో రెండవప్రదక్షిణముననున్నది. పూర్వము స్వామి వారి అభిషేకతీర్థము సోమసూత్రముద్వారా కటాహతీర్థమునందు పడుచుండెను. సోమసూత్రముద్వారా వచ్చుచుండిన తీర్థము కొన్ని కారణములచే మూయబడెను. ఇప్పుడు స్వామివారి అభిషేకతీర్థమును పాత్రలతో తెచ్చి యీతీర్థమునందు బోసెదరు. ఇందలి జలంబులను త్రాగినను మీద చల్లుకొనినను బ్రహ్మహత్యాది దోషములును, పాపములును నశించును. ఇదియునుంగాక పరమపదమునిచ్చుననియు స్కంధ పురాణములో చెప్పబడియున్నది.

శ్లో॥ "ఇత్యుక్త్వాసపిబేన్నిత్యం మోక్షమార్గైకసాధనం।
స్వామిపుష్కరిణీస్నానం వరాహశ్రీశదర్శనం॥
కటాహతీర్థపానంచత్రయం త్రైలోక్యదుర్లభం।
బహునాకిమిహోక్తేన బ్రహ్మహత్యాదినాశకం॥
కటాహతీర్థ సేవాంచకుర్వంతి ద్విజసత్తమాః।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రాశ్చేతర జాతయః॥
స్పృశంతి తజ్జలమితి నపిబేద్యోవిమూఢధీః।
సహిచండాలతాం ప్రాప్యకుంభీపాకే పతిష్యతి॥"

నాలుగు వర్ణాశ్రమములవారును భేదబుద్ధిలేక యీతీర్థము నందలి జలమును పానము చేయవలసినదనియు, అట్లు భేదబుద్ధికలిగిన మూర్ఖులు చండాలత్వముచెంది కుంభీపాక నరకమునం బడుదురనియు పురాణములలో చెప్పబడియున్నది.

## విరజానది.

ఇది స్వామివారి గుడికి మూడవ ప్రదక్షిణంబున పడమటి భాగంబునందున్నది. శ్రీస్వాములవారు శ్రీకృష్ణమూర్తి రూపంబున తమపత్నులతో జలక్రీడ సలుపుదురని పెద్దలు చెప్పుదురు. కాబట్టి దీనిని జలక్రీడబావియనియు చెప్పుచున్నారు. దీనిజలమును నరులు త్రాగుటయు, మీాద చల్లుకొనుటయు గలదు. శ్రీస్వామివారి పాదముల క్రింద విరజానదియను పెద్దనది క్రింద పారుచున్నదనియు మహాత్ములు చెప్పుచున్నారు. శ్రీస్వామి పుష్కరిణికి పూర్వభాగంబున మూడు తీర్థములున్నవని పురాణములలో చెప్పబడుచున్నది. అవి జ్ఞానులకే గాని సామాన్యనరుల కగుపడుటలేదు. పైచెప్పబడిన తీర్థములుగాక యితరతీర్థములు ఆయానామములచే స్ఫురించు కారణములవలన వచ్చినవి.

## కపిలతీర్థము.

కపిలతీర్థము తిరుపతిప్రక్కన దక్షిణపార్శ్వంబున నున్నది. ఇది తిరుపతికి 1½ మైలు దూరముననున్నది. ఈతీర్థము కపిలమహర్షి వలన నీపేరుకలిగెను. పూర్వకాలంబున విష్ణుమూర్తి వామనావతారంబున బలిచక్రవర్తిని మూడడుగుల స్థలంబిమ్మని భిక్షుమడుగ నతడొల్లాసంగెను. అంత వామనమూర్తి విశ్వరూపముధరించి



యొక అడుగుచే సురలోకంబు నాక్రమింప బ్రహ్మపావనంబగు అతని పాదంబును దనకమండలోదకంబున సేచనంబొనర్ప నాజలంబు స్వర్గలోకంబున ప్రవహించి మందాకినియై వర్తించెను. పూర్వము అయోధ్యాదేశమును బరిపాలించుచుండిన సగరచక్రవర్తికి యిరు భార్యలుగలరు. వారిరువర్లకు పుత్రసంతానములేనందున భృగుమహర్షినిం గూర్చి యనేకవేల సంవత్సరంబులు సగరచక్రవర్తి తపస్సు కావించెను. భృగుమహర్షి యనుగ్రహమువలన సగరచక్రవర్తి మొదటిభార్యవలన అసమంజసుడను కొమారునిని, రెండవభార్య వలన అరువదివేలు సుతులను బడసెను. సగరుచక్రవర్తి అశ్వమేధ యాగంబుజేయగోరి అధ్వరాశ్వంబును గాపాడుమని సగరచక్రవర్తి ప్రథమపుత్రుడగు అసమంజసునకు కొమారుడును, దనకు పౌత్రుండు నగు అంశుమంతుని నియమించెను. ఇంద్రుడీయాగంబున కోర్వక మనుజవేషధారియైవచ్చి అశ్వంబును దొంగలించుకొనిపోయి పాతాళలోకంబున దపస్సుసల్పుచున్న కపిలఋషి దగ్గరవదలిపోయెను. సగర చక్రవర్తి హయంబునుగానక దానిని గనిపెట్టి తెండని తన ద్వితీయ భార్యవలన గలిగిన అరువదివేల సుతులకుత్తరవుచేయ వారతిశీఘ్రంబున వెళ్ళి భూమి నలుపార్శ్వములయం ద్రవ్వి చూచినను హయంబు కానరాకపోయెను. వారు త్రవ్విన ప్రదేశములంతయు బ్రహ్మాండమగు సముద్రంబులయ్యె. వారు అంతటితోనిలువక భూమండలమంతయు వెదకి పాతాళలోకంబునచని యచట పరమతపస్సు చేయుచున్న కపిలఋషిదగ్గిర హయంబునుంచూచి కపిలఋషియే గుఱ్ఱమును దొంగలించి కపటమార్గంబున నున్నవాడని వారునిశ్చయించి యతనినిచంపి గుఱ్ఱమును కొనిపోవుటకు ప్రయత్నపడు తరి కపిలముని రోషావేశంబున కన్నులు కోపాగ్నిచే తెఱచిచూడ సగరచక్రవర్తి సుతులు దగ్ధులై భస్మరాసులైరి. వీరిస్థితి యిట్లుండ సగరచక్రవర్తి తనకొమారులు అశ్వంబును గొనిరాకయుండుట కారణమేమని విచారించిరమ్మని తనమనుమడగు అంశుమంతుని పనుపెను. అంతట

అంశుమంతుడు పాతాళలోకంబున కేగి పినతండ్రుల స్థితినింగాంచి దుఃఖించి, హయంబునిమ్మని కపిలమునిని వేడ నతడు అశ్వమునుయిచ్చి ఆకాశగంగచే నతని దగ్ధించిన పినతండ్రులను దడిపిన వారు పితృలోకము చేరెదని చెప్పెను. అంతట అంశుమంతుడు అశ్వమును తన తాతకునిచ్చి జరిగినసంగతులు చెప్పెను. సగరచక్రవర్తి అశ్వమును గొని యాగమును నెరవేర్చెను.

ఆకాశగంగను భూమికిదెచ్చుటకు ముప్పదివేల సంవత్సరంబులు ఉగ్రమైన దపంబుచేసెను. ఆతపస్సువలన ఫలంబుగాంచక మృతినొందెను. ఇతనికిదరువాత అంశుమంతుడును అతనికివెనుక అతనిపుత్రుండగు దిలీపుండును మితములేని వేలకొలది సంవత్సరములు తపస్సొనలపిరి. వారును తపఃఫలంబుగాంచక జచ్చిరి. దిలీపునికితరువాత నతనికొమారుడగు భకీరథుండు పదివేల సంవత్సరములు భయంకరమైన తపస్సుచేసెను. బ్రహ్మ యాతని శ్రద్ధాభక్తికిమెచ్చి కోరిన కోరికలొసంగెదను. అట్లుచెప్పిన బ్రహ్మను దిలీపుని కొమారుడగు భగీరథుండు సురలోకగంగను భూలోకంబునకు దెప్పింపుమని ప్రార్థించెను. బ్రహ్మ యందుల కంగీకరించెను, అయినను మందాకినిని భరించుటకు శివుడే యోర్పుగాన నతనిని వేడి గంగను దెచ్చుకొనుమని భగీరథునికి సెలవొసంగి వెళ్లెను. అంతట భగిరథుండు శివునినిగూర్చి అనేకవత్సరంబులు భయంకరమగు తపస్సొనలుప మహేశ్వరుడు ప్రత్యక్షుండై గంగను దన శిరంబునందాల్ప నియ్యకొనియె. భగీరథుండు తర్వాత మందాకినింవేడ నది దేవలోకమునుండి భూలోకమున కతిభయంకరముగ వెడల శివుడు దానిని తన జటాజూటంబునందాల్చి అందుండి భూలోకంబునకువిడువ నది యతిశీఘ్రమునవేగి హిమాచల ప్రాంత్యమందుండు బిందుసరస్సును



ప్రవేశించె. అచ్చటనుండి యేడుకాలువలై తూర్పుదిక్కున మూడు కాలువలును, పశ్చిమభాగంబున మూడుకాలువలై పారి యొక కాలువ భగీరథునివెంటం బాతాళలోకమునకు జనెను. అట్లు జనుచుండ మార్గమధ్యంబున జహ్నుమహర్షి యాగంబుసలుపుచుండ నచ్చట పారి యాగంబునకు విఘ్నంబుగావించె. దానిని కన్మహర్షి గాంచి యాగంగను అయాసములేక పానంబొనర్చె. అంత భగీరథుండు తనయత్నము సఫలముకాకపోయెనని వ్యసనాక్రాంతుడై దుఃఖించి జహ్నుమహర్షిని దీనుడై వేడెను. అప్పుడు జహ్నుమహర్షి కరుణారసముతో హృదయమున నిండినవాడై తనకర్ణముల రంధ్రంబుద్వారా గంగను బైటవిడిచెను. భగీరథుండు తెచ్చిన కతంబున గంగకు భాగీరథియనియు, జహ్నుఋషివిడిచిన కారణంబు జాహ్నవియనియు పేరులొప్పుచుండెను. జహ్నుమహర్షి దయచే గంగ భగీరథుని వెంటజని పాతాళలోకంబున కేగి సగరనందనుల భస్మరాసుల దగ్గిర పోవుచుండ నచ్చోట కపిలమహర్షి శివలింగ ప్రతిష్ఠగావించుకొని శివపూజ యొనర్పుచుండె. అంత భగీరథుండు గంగాప్రవాహముచే కపిలమహర్షి పూజకు భంగముకలుగునని భయపడి యతనిం వేడ నతడు జాహ్నవినుండి యొకకాలువను దనకిచ్చిన తానచ్చోట విడిచి భూలోకంబున వెళ్లెదనసియెను. భగీరథుండట్లుచేయ జాహ్నవిం ప్రార్థింప నదియందులకు ఒప్పుకొని యొకపాయను కపిలునివెంట విడిచెను. కపిలఋషి శివలింగమును వేడ నది యందులకుఒప్పి భూమిని చేటించుకొని భూతలంబున కేగి శేషాచలంబునకు దక్షిణభాగంబున ప్రసన్నమై కపిలేశ్వరలింగంబను నామము ప్రకాశించెను దానివెనుక మందాకిని శాఖయు కపిలుంమను జనుదెంచిరి. ఆమం

దాకిని జలంబు కపిలలింగంబునకు పశ్చిమభాగంబున సరోవరరూపంబున నిలిచెను. కపిలమహర్షి యాచెంతనే వసించుచు కపిలలింగంబునను బూజసల్పుచుండె. భగీరథుడు జాహ్నవీజలంబులను దనపితృల భస్మరాసులపై పారనీయజేసి వారికి పరలోకసుఖంబులు గలిగించెను. కాబట్టి ఇట్టిమహాపాపంబులను బోగొట్టు తీర్థంబున స్నానంబుగావించినవారికి గంగా, యమునా, సరస్వతి స్నానఫలము గలుగుననుటకు యెసుమంతైనను సంశయము లేదు. ఇందులో స్నానమాచరించిన వారు అనేక జన్మములనుండి చేసిన భయంకరమైనటువంటి పాపముల నుండి తొలగింపబడుననుటకు దృష్టాంతములుకలవు. అవేవియనగా మొదట శ్రీకాళహస్తిపురంబున మాధవుండను బ్రాహ్మణుండొకడుండెను. అతడొకదినంబున దనభార్యయగు చంద్రరేఖను బగటియందు సంభోగమునకు బిలువ నామె పాపమునకు భయపడి యందులకు సమ్మతింపదయ్యె. అంత నావిప్రుడు బలవంతముతో నామెతో రమించుటకు బ్రయత్నించెను. నాపతివ్రతాశిరోమణి భర్తమాటను మీరజాలక అతనిం పుష్పవనంబునకుబొమ్మని తానచ్చోటికి వచ్చి యతనికోరికెను తీర్చెదనని యెను. నాబ్రాహ్మణుడట్లే పుష్పవనంబునకేగి యచట విహరించుచు దివ్య వస్త్రాభరణాలంకృతయై యచట విహరించుచున్న కుంతలయను పద్మినీజాతి చండాలస్త్రీనికని మోహించెను. ఇట్లుండ విప్రునిభార్య చంద్రరేఖ యావనంబునకేతెంచి తనభర్త కోరికను దీర్చుకొమ్మని బ్రార్థింప నతడామెను బరిహాసించి నిన్ను పరీక్షించుటకే యీలాగుచెప్పితినని యామెను బరిహాస మాటలతో గృహమునకుపనుపి యాకుంతలయను చండాలస్త్రీతో సంభోగింపగోరి; దానిని దీనుడై ప్రార్థింప నది పాపంబునకు భయపడి



రాశని వాంఛించినను మాధవుడను విశ్రుతు దానిమాటలను అంగీకరించక మోహపాశమున జిక్కినటువంటివాడై రమింప బలత్కారపఱచెను. తుదకు నాబ్రాహ్మణుని ప్రయత్నము విఫలయాయెను. అతడు యజ్ఞోపవీతమును నీటగలిపి యాస్త్రీతోనే ననేకవత్సరంబులు కామభోగంబు సల్పుచుండెను. కొంతకాలంబునకు తర్వాత అది మృతిచెందెను. మాధవుడు మిగుల వ్యసనాక్రాంతుడై తనజ్ఞానమునకు పశ్చాతాపముచెంది వెఱ్ఱివాడై తిరుగుచుండెను. అట్లు తిరుగుచుండ నొకదినంబున కొందఱుభక్తులు తిరుమలకు యాత్రార్థమై పోవుచుండ వారివెంటనే దానును నేగి కపిలతీర్థముచేరి యాతీర్థము నుండి బయటపారు జలంబున స్నానముచేసి మృత్పిండంబులు పితృదేవతులకొసగ నవి యన్నపిండంబులయ్యె. అంత నతనిపితృదేవతులు ప్రత్యక్షముగ నాపిండంబులను భుజించి తృప్తిచెందిరి. మరుజన్మంబున నితడు ఆకాశరాజైపుట్టి వేంకటాచలపతికి మామమాయెం. కావున కపిలతీర్థముయొక్క మహాత్మ్యమును వక్కాణింప బ్రహ్మాదులకును శక్యముగాదు. ఇదియునుగాక పూర్వకాలంబున మాళవదేశంబున ఆత్మారాముడను బ్రాహ్మణుడు ద్రవ్యంబంతయు బోగొట్టుకొని యేమియుతోచక వూరు వూరు పిచ్చివానివలే దిరుగుచు వేంకటాచల ప్రాంత్యంబుచేరి యచ్చటికి దగ్గిరనున్న కపిలతీర్థంబున స్నానమాచరించి కపిలేశ్వరుని సేవించి పూర్వ జన్మకర్మ విముక్తుడై తన స్వగ్రామముచేరి సర్వసుఖంబులననుభవించెను. విష్ణుశర్మయను బ్రాహ్మణుండొకడు భగవంతుని వుత్తరవుచొప్పున నీతీర్థంబున స్నానమాచరించి సర్వసుఖములను పొందెను. ఇంకను మహాత్ములు, యోగీశ్వరులు, దేవతులు, ఋషులు అనేకులీతీర్థంబున స్నానమాచరించి తమ

మనోకోరికలను నెరవేర్చుకొని ముక్తులైరి. కపిలతీర్థంబున పైభాగంబున వేంకటాచలంబున (1) చక్రతీర్థము, (2) విష్వక్సేనతీర్థము, (3) పంచాయుధతీర్థములు, (4) అనలతీర్థము, (5) బ్రహ్మతీర్థము. సప్తఋషితీర్థములను పదునాఱు పుణ్యతీర్థములు వరుసగాగలవు. వర్షాకాలంబున కపిలతీర్థంబున పైతీర్థంబులనుండి పారునీరు కపిలతీర్థంబున పడుచున్నది. నీతీర్థంబున పైతీర్థంబులనుండి నీరు నిండి పారుచున్నప్పుడు చూచుటకు మిగుల మనోహరముగానుండును. ఈతీర్థమునందు స్నానము కార్తికమాస పర్వణకాలమందు విశేషఫలము నిచ్చును. ఈతీర్థముయొక్క మూడుదిక్కులయందు రమ్యమును విశాలమునగు మంటపములుగలవు, యాత్రస్తులు తిరుపతిపుర నివాసస్తులు జరుపు గొప్ప సమారాజనలు లిచ్చటనే జరుగుచున్నవి. కపిలతీర్థంబున బ్రహ్మ విష్ణు మహేశ్వరుల తీర్థంబులని మూడు చిన్నతీర్థములు గలవు.

వీనిజలము పరిశుద్ధముగను రుచికరముగనుండును. యాత్రస్తులు వీనినుండి జలముతీసుకొని స్నానపానాదులు గావించుకొందురు. యీతీర్థగట్టునకు తూర్పుభాగమున కపిలేశ్వరునిగుడికలదు. విగ్రహమును దేవాలయమును చూచుటకు బహుఅందకరమయినవి. కపిలేశ్వరుని యాలయములో మహాశివరాత్రి కార్తికదీపము విజయదశమి వినాయకచవితి యీదినములలో వుత్సవములు జరుగుచున్నవి. ఈతీర్థగట్టున శ్రీనృసింహస్వామివారి గుడికిప్రక్కన పర్వతములోని కొంగ గుహగలదు. పూర్వము తొండమాన్ చక్రవర్తి సత్రువులభయముచే నీగుహాలో దాగియుండి శ్రీనివాసమూర్తిని ఆరాదించుతూ తనకు శత్రువులచేగలిగిన ఆపదలను దీనుడయివేడ వానికి నభయంబిచ్చి



తనచక్రాయుధమునుపంపి శత్రువులను దునుమాడి మల్లి రాజ్యభోగమునననుభవించెను. గాన యీతీర్థములో స్నానమాచరించినవారు అనేకపుణ్యాము లనుభవించుతు యీతీర్థమునకు శ్రీవైష్ణవులు ఆళ్వారుతీర్థమని చెప్పుదురు.

## శ్రీవేంకటేశుని దేవాలయ ప్రాకారాములను గట్టించినవారు.

పూర్వము శంకరమహారాజు శ్రీవేంకటేశుని గర్భగృహము మంటప ప్రాకారాదులును గట్టించిరి. అవి దినక్రమేన జీర్ణముకాగా పాండ్యవంశపురాజులు చోళరాజులు మరల జీర్ణోద్దారము చేయించిరి. తొండమాన్ చక్రవర్తి కలియుగాదియందు శ్రీవేంకటేశ్వరులయాలయమును గట్టించిరి. పరీక్షున్మహారాజు రెండవప్రాకారమును అతని కొమారుడు జనమేజయమహారాజు బైటిప్రాకారమును గట్టించిరి, ఉత్తుంగ చోళరాజు ప్రదక్షణముచుట్టు మండపమును యాగశాలమండపమును గట్టించెను. కులోత్తుంగ చోళరాజు పెద్దప్రదక్షిణమంటపమును తిరుమలరాయ మంటపమును కట్టించిరి. తిరుమలరాయమంటపమును ఉయ్యాలమంటపమనియు చెప్పెదరు. ఉయ్యాలమంటపమందు శ్రీవేంకటేశ్వరులకు వసంతోత్సవమును బ్రహ్మోత్సవకాలమునందు ఆస్థానమున జరుగుచున్నది. తిరుపతి గండచోళరాజు రాతితేరు మంటపమును గట్టించెను. అదియిప్పుడు కొంతమట్టిలోపూడి కొంత శిదిలమయిపోయినవి. చోళరాజు స్వామిపుష్కరిణికి ప్రదక్షణమును మూడవప్రదక్షణము గట్టించిరి. శ్రీరంగరాజు రాతిమంటపములు వేయికాళ్లమంటపము మొదలగుకట్టడములు గట్టించిరి. ఇమ్మడి నర

సింగరాయులు చంద్రగిరి దుర్గమునుకట్టించి శిధిలమయిన కొన్నికట్టడములను జీర్ణోద్ధారముచేయించిరి. కృష్ణదేవరాయల సంతతివాడగు వేంకటదేవరాయులు చంద్రగిరిదుర్గమునుంచి శ్రీ వేంకటేశ్వరుల దేవాలయమువరకు అచ్చటచ్చట మంటపములను గట్టించిరి. శ్రీవారికి పూజఅగుటను గంటలద్వారా తెలుసుకొని పిమ్మట తాము భుజించుచువచ్చిరి. అప్పుడు కట్టిన మంటపములు యిప్పటికిని కొన్ని గలవు, కొన్ని శిధిలమయియున్నది. ఇంకయు ననేకరాజులు అనేక మంటపములను, గోపురములను జీర్ణోద్ధారణజేసిరి. వానిలో ముఖ్యములయినవి ఏవియనగా,

(1) మూడవప్రదక్షిణమున పడమటిభాగంబున కట్టియుండు ఉగ్రాణము (2) విమానప్రదక్షిణమను పేరుగల రెండవప్రదక్షిణమున దక్షిణపార్శ్వముననుండు వంటశాల. (3) కల్యాణమంటపము (4) ఆలయములోనికిబోవు మార్గమునకు దక్షిణభాగమునందు రంగనాయకులమంటపము (5) ఉత్తరదిక్కుననుండు అద్దాలమంటపము శ్రీరంగనాయకుల మంటపమున అధికమాసమువచ్చు సంవత్సరములందు వేంకటేశ్వరులవారి నవరాత్రిఉత్సవములు జరుగును. శ్రీవేంకటేశ్వరులవారిని అద్దాలమంటపమున అద్దమునందు ప్రదర్శింతురు. పూర్వము వేంకటేశ్వరులగుడియందు ప్రదక్షిణముచుట్టు త్రోవలందు బంగారుమలాము వేసిన ఇత్తడి రేకులను పొదిగించియుండిరి. ఇప్పుడు అవిఅన్నియు శిథిలమయిపోయినవికాని అక్కడక్కడ రేకులనుపొదిగించిన చీలలతలు అనేకములుమీద అగుపడుచున్నవి. ఇదిగాకపూర్వము శ్రీవేంకటేశుని సేవించిన భక్తులయొక్క పలువిధములయిన కైంకర్యములను యిప్పుడుజనులకు గురుతుగా తెలియగలందులకు కోవిలప్రాకారములందును ఇంకయు నచ్చటచ్చట వ్రాయబడియుండు తామ్రశాసనములను జూడ వచ్చును.



శ్రీ వేంకటేశ్వరులవారికి పూజలనేర్పరిచి ధర్మకార్యములొనర్చిన
వార్లనామధేయములు, వార్ల ఆరాధనలు యీక్రింద
విశదముగా పేర్కొనబడినవి.

పూర్వము కీర్తివహించిన శ్రీమాన్ మన్రోప్రభువుగారు ప్రతిదినమును శ్రీ స్వామివారికి పొంగలి గంగాళమునేర్పరిచిరి. ఇప్పటికికూడా శ్రీ స్వామివారికి పైనుదహరించిన ధర్మము జరుగుచున్నది. మైసూరు మహారాజుగారు ప్రతిదినమును వెన్నతోమిళితమైన చక్కెరయును, అన్నగంగాళమును ఏర్పాటుచేసియున్నారు. శ్రీ వేంకటేశ్వరులగుడియందలి అఖండమునకుగాను 4 వీశెలు నెయ్యి యిచ్చెదరు. మఱియు ప్రతిదినము శ్రీస్వామివారికి అర్చనజరిపెదరు. ప్రతిశుక్రవారము పంచపరమాన్నము స్వామివారికి నివేదింతురు. ఎళందూరు జాగీరుదార్లగు దివాన్ కృష్ణమూర్తిపంతులుగారు నవనీతహారతి అన్నగంగాళమును, అనంతశయనమహారాజుగారు, చెన్నపట్టణపు టాకరు అండుసన్సువారు పొంగలి, చక్కెరపొంగలి, గంగాళములను, బెంగుళూరు శామణ్ణగారు, పుదుకోట రాజాగారును దధ్యోదనతళిగెలను, దేవస్థానమువారు ప్రతదినము పులిహోర, మొళహోర, దధ్యోదనము మొదలగు తళిగెలను ప్రతి శుక్రవారము హాథీరాం బావాజీమఠమువారు పాయసమును, దేవస్థానాధికారులు పోలీలును, యింకా అనేకపుణ్యాత్ములు అనేకవిధములగు నైవేద్యములను, ఉత్సవములను, హారతులను యెడతెగక జరుపుచున్నారు. ఇప్పటికి సుమారు 100 శంవత్సరములప్పుడు తిరుమలయందు తరిగొండ వెంకమ్మయను నొక బ్రాహ్మణస్త్రీ ఆశ్రమమేర్పరచుకొని శ్రీ వేంకటేశ్వరులకు మిక్కిలి భయభక్తితో సేవలొనర్చు

చుండె ఆశిరోమణియొక్క భక్తికిని పొగడుటకు శక్యముకాదు తిరుమలపురి కుత్తరభాగంబున తరిగొండ వెంకమ్మ యాశ్రమమును ఆమె త్రవ్వించిన దిగుడుభావియును ఆమెవుండినస్థలములో గురుతుకుగాను సమాధియు యిప్పటికినిగలవు. తరిగొండ వెంకమ్మ ప్రత్యక్షముగా శ్రీవేంకటేశ్వరులతో సంభాషించునట్లున్ను, తుంబురుకోనలో ఐక్యసంధానమైనట్లును గ్రంధములు మొరలిడుచున్నవి. ఈభక్తురాలు రాజయోగానందసారమను ద్విపదకావ్యమును రచించినది. ఇదియునుంగాక శ్రీవేంకటేశ్వరులమీద పద్యకావ్యము తేటతెనుగున రచించినది. తరిగొండ వెంకమ్మ దిగుడుభావి త్రవ్వినప్పుడు గంగపడని దానివల్ల గంగాభవానిమీద ఏకభక్తితో తత్వకీర్తన పాడినందున ఆమె భక్తికి గంగాభవాని మెచ్చి దిగుడుభావిలోనుంచి గంగ వుప్పొంగెను. యాత్రస్థులు ప్రతిదినమును పలువిధములగు నైవేద్యములను జరిపించుచున్నారు.

తిరుమలమీద మైసూరు మహారాజులుంగారు యాత్రస్థులకు సత్రమునుకట్టించి ప్రతిదిన మొకతూరి పరిపూర్ణభోజనమును పెట్టించుచున్నారు. శ్రీవైష్ణవకూట యాత్రస్థులకు రామానుజకూటమున అన్నముపెట్టించుచున్నారు. యాత్రస్థులు దిగుటకు తిరుమలమీద మైసూరువారి సత్ర సౌకర్యముతప్ప వేరేసత్రము యింత అనుకూలముగ కానరాదు. అన్నదానసత్రము మైసూరు మహారాజులుంగారిది తప్ప వేరే అన్నదానసత్రములేదు. పూర్వము వెంకటగిరి రాజులు కాళహస్తిరాజులు యాత్రస్థులు బసచేయుటకు సత్రములు కట్టించినారు, అవి యిప్పుడు పడిపోయి యాత్రీకులకు ప్రయోజనము



లేనివై యుంటున్నవి. తిరుమలమీద వేయికాళ్లమంటపమున్నది. అది మిగుల విశాలముగాయుండుటవల్ల మహాంతు భగవాన్‌దాసు వారు ఆమంటపములో అరలు కట్టించిరి. ఇప్పుడు అరలకు తలుపులు లేవు. కొంతభాగము పడిపోయియున్నది. కొన్ని అరలుతప్ప మిగత అరలలో యాత్రస్థులు బసచేయుటకు నీరుఆధారము చాలవు. సౌకర్యము లేవు. శిధిలమైనవాటిని మరామత్తుచేసి చాలినంత జలసౌకర్యము కలుగజేసినయెడల యాత్రస్థులు బసచేయుటకు అనుకూలముగానుండును. వేయికాళ్ల మంటపమును రాయలవారు స్వామి దిగుటకుగాను కట్టించిరి. దీనిని కట్టించుచూ శెలవుచేసినద్రవ్యము యెంతమాత్రమని లెక్కపెట్టగా శ్రీవేంకటాచలపతి ఆవేశరూపంబున వచ్చి అతృప్తిజెంది ఆమంటపంబున దిగుటలేదని వచించిరనియు పెద్దలు చెప్పుచున్నారు. ఇప్పుడు వరుసాకాలములందు యాత్రస్థులకు చాలినంత సత్రములు తిరుమలయందు లేనిదానివల్ల చాలా కష్టపడుచున్నారు. గాన మైసూరు మహారాజులుంగారు లొనర్చియుండు ధర్మకార్యములవంటికి మరికొందరు లొనరింతురేని యాత్రీయులకు మిగుల సుఖములను కలిగించినవారలై శ్రీవేంకటేశ్వరుల దయకు పాత్రులగుదురు.

## ఉత్సవములు-వాటి క్రమములు.

శ్రీవారిని బ్రహ్మ తిరుమలమీద నివసించునట్లు ఏర్పాటుగావించినపిమ్మట ఆశ్వయుజ మాస పూర్వపక్షంబున చిత్తానక్షత్రమున ధ్వజారోహణంబుగావించి అదిమొదలుకొని తొమ్మిదిరోజులు మహావైభవముతో విష్ణుమూర్తికి బ్రహ్మోత్సవ మొనరించిరి. అది

మొదలుకొని నేటికినమువరకు ప్రతిసంవత్సరము ఆశ్వయుజ మాస పూర్వపక్షంబున చిత్తానక్షత్రమున ధ్వజారోహణంబుగావించి బ్రహ్మోత్సవము జరుగుచున్నది. బ్రహ్మోత్సవమను పేరువచ్చినది కెందుకనగా బ్రహ్మ మొదట నీయుత్సవమును జరిపించినందుచేత బ్రహ్మోత్సవమను పేరుకలిగెను. దీనిని ననుసరించియే యితరస్థళములయందును జరుగునట్టి ఉత్సవములకు బ్రహ్మోత్సవములని చెప్పుచున్నారు.

సంవత్సరాది

## బ్రహ్మోత్సవ క్రమము.

| | పగలు. | రాత్రి. |
|---|---|---|
| 1. మొదటిదినము సాయంత్రము | ధ్వజారోహణము<br>బంగారు తిరుచియనే పీఠము | పెద్దశేష వాహనము |
| 2-వ దినము | చిన్న శేష వాహనము | హంసవాహనము |
| 3-వ దినము | సింహ వాహనము | ముత్తుపందిలి |
| 4-వ దినము | కల్పవృక్షము | బంగారు సర్వభూపాల విమానము |
| 5-వ దినము | పల్లకిలో మోహిని అవతారము | గరుడవాహనము |
| 6-వ దినము | హనుమంతవాహనము, వసంతోత్సవము | ఏనుగవాహనము |
| 7-వ దినము | సూర్యప్రభ | చంద్రప్రభ |
| 8-వ దినము | రథము | గుఱ్ఱపు వాహనము |
| 9-వ దినము | తీర్థవారి | ధ్వజావరోహణము |



వీనిలో జరుగు ముఖ్యమైన ఉత్సవములేవియనగా-అయిదవ దినంబున జరుగు గరుడోత్సవమును, ఎనిమిదవదినమున జరుగు రథోత్సవమును, తొమ్మిదవదినంబున జరుగు తీర్థవారియు ముఖ్యములు. తీర్థవారిదినంబున చక్రంబు వరాహపుష్కరిణిలో మునుగును. చక్రంబు స్నానంబాచరించు సమయంబున స్నానము చేయువారు పాపములనుండి తొలగించు నటువంటివారలై యెల్లసుఖములను పొందుచున్నారు. జనులు బ్రహ్మోత్సవ కాలమునందు విశేషముగ చేరుచున్నారు. మూడు సంవత్సరముల కొకతూరి అధికమాసమువచ్చు సంవత్సరములో మొదటి బ్రహ్మోత్సవము జరిగిన సమయములో రెండవ బ్రహ్మోత్సవము జరుగుచున్నది. అయినను మొదటిబ్రహ్మోత్సవము జరుగునంత అధికముగా రెండవబ్రహ్మోత్సవము జరుగుటలేదు. ఇదియునుగాక యాత్రికులు శ్రీస్వామివారికి బ్రహ్మోత్సవములు జరుపుచున్నారు. స్వామివారికి బ్రహ్మోత్సవం జరుపువారి పుణ్య మింతయని వర్ణింప శక్యముకాదు. శ్రీ వేంకటేశ్వరులకు బ్రహ్మోత్సవముగాక యింకా అధికవుత్సవములుజరుగుచున్నవి. అవి యేవియనగా (1) నిత్యోత్సవము, చైత్రమాసంబున నిత్యోత్సవము సంవత్సరాదిరోజున ప్రారంభమై అది మొదలుకొని 40 రోజులు జరుగుచున్నది. ఈదినములయందు శ్రీ స్వామివారిని ఊరేగింపు చేయుచున్నారు. ఇదియునుగాక మరి కొన్ని ఆస్థానోత్సవములు జరుగుచున్నది. (2) శ్రీరామనవమి, (3) సంవత్సరాది, (4) గోకులాష్టమి, (5) ఆనివరె, (6) గోకులాష్టమి, (7) దీపావళి, కౌశికద్వాదశి యీదినములయందు శ్రీ స్వామివారిని కొలువుమంటపమునందు వేంచేయించి ఆస్థానము జరుగుచున్నది. వీటిలో విశేష యాస్థాన ఉత్సవములు ఏవియనగా (1) దీపావళి, (2) సంవత్సరాది, (3) ఆనివరె. యీవుత్సవములలో జనులు విశేష

ముగా వేంచేయుచున్నారు. శ్రీవారికి ఒక్కొక్క శ్రవణ నక్షత్రమునను దేవస్థానము వారి యుత్సవంబును, మైసూరు మహారాజుగారి ప్రతి చిత్తానక్షత్రంబున యుత్సవంబును జరుగుచున్నవి. శ్రీరాముల వారికి ఒక్కొక్క పునర్వసు నక్షత్రంబునను శ్రీ హాథీరాంజీ మఠమునకు అధికార్లవారి సొంత ద్రవ్య శెలవులతో నేత్రోత్సవమున ఉత్సవము జరుగుచున్నది. శ్రీవైకుంఠ ఏకాదశిరోజున గుడియందలి ప్రథమ ప్రదక్షిణద్వారము తెరవబడును. ఇతరదినములయందు గుడియందలి ప్రథమ ప్రదక్షిణద్వారము మూయబడియుండును. దీనినే వైకుంఠ ద్వారమనియు, తొట్టితీర్థప్రదక్షిణమనియు చెప్పెదరు. శ్రీవైకుంఠ ఏకాదశిదినంబున నీద్వారమున ప్రదక్షిణము చేయువారికి మిగులపుణ్యము కలుగును, ఈరోజున శ్రీవేంకటేశ్వరులకు నూరేగింపును జరుగును. రథసప్తమిరోజున శ్రీస్వాములవారికి ఏడువాహనములమీద నూరేగింపు జరుగుచున్నది. దీనిని వీక్షించుటకు జనులు బహు దూరదేశములనుండి విశేషముగా వచ్చెదరు. ఈయుత్సవము మిక్కిలి ఆనందమిళితమై యుండును. ధనుర్మాసములయందు శ్రీవేంకటాచలపతికి ప్రతిరోజును ఉదయంబున బిల్వములతో అర్చన జరుగును. బ్రహ్మోత్సవమందు ధ్వజారోహణదినంబునను, రథసప్తమిరోజున, సంవత్సరాది దీపావళి ఆస్థానదినంబులను ప్రథమవాహనముగు సూర్యప్రభవమీద శ్రీ స్వాములవారు వేంచేయునపుడును, వైకుంఠఏకాదశిరోజునను శ్రీస్వాములవారి ఉత్సవ విగ్రహములకు వజ్రకవచమును, రత్నములతో పొదగించిన కిరీటమును సమర్పించెదరు. ఇదియునుంగాక శ్రీ స్వాములవారికి యాత్రికులు గరుడోత్సవము లెన్నియో జరిపించుచున్నారు.



## ఉత్సవములయొక్క వివరములు-వాటియొక్క కట్టడములు.

| | | | |
|---|---|---|---|
| 1-టి తరగతి | బ్రహ్మోత్సవము | రు | 1095—0—0 |
| 2-వ డిటో | డిటో | ,, | 765—0—0 |
| 3-వ డిటో | డిటో | ,, | 664—0—0 |
| 4-వ డిటో | డిటో | ,, | 568—0—0 |
| 5-వ డిటో | డిటో | ,, | 525—0—0 |
| వసంతోత్సవము (పదిరోజులు) | | ,, | 705—0—0 |
| కల్యాణోత్సవము | | ,, | 255—0—0 |
| వజ్రకవచముసహా వాహనములు | | ,, | 61—0—0 |
| వజ్రకవచములేని వాహనములు | | ,, | 41—0—0 |
| గరుడవాహనము మొదలగు ఇతర వాహనములు | | ,, | 21—0—0 |

28-వ కలియుగంబున బ్రహ్మాగంబురా మొదలగు వాసన పదార్థములను కలిపి మాధవునికి పాలుతో అభిషేకము చేసిరి. శ్రీ స్వాములవారు పుట్టయందు వేంచేసియుండిన సమయమునను ఆవు పాలు ధారలచే నభిషేకము జరుగుచుండెను. ఇప్పటికిని ప్రతిశుక్రవారము శ్రీస్వాములవారికి పాలుతో అభిషేకమును, పునుగుతైలము, కుంకుమపువ్వు, పచ్చకర్పూరము, కస్తూరి, చందనము మొదలగు వాసన ద్రవ్యములతో అభిషేకము జరుగుచున్నవి. ఈకాలమునందు తప్ప యితరవేళలలో శ్రీస్వాములవారికి అభిషేకము జరుగుట లేదు. ప్రతి లక్ష్మివారమున రాత్రివేళయందు శ్రీస్వాములవారికి పూలంగిసేవ జరుగుచున్నది. ప్రతివారంబున నీరెండు విశేషసేవలు.

## శ్రీ స్వాములవారికి ప్రతిదినపూజలు, సేవలు, నైవేద్యములు వాటియొక్క వివరములు

1. విశ్వరూపదర్శనము తెల్లవారి రమారమి 8 ఘంటలు మొదలు 10 ఘంటలవరకు జరుగును.

2. 10 ఘంటలు మొదలుకొని తోమాలసేవ, హారతి, అర్చనలుజరిగి 11 మొదలు 12 ఘంటలకు మొదటిగంట నైవేద్యము జరుగును. పిమ్మట మొదటిగంట దర్శనము జరుగును.

3. అర్చనజరిగి, సుమారు 2 మొదలు 3 గంటలకు రెండవ గంట నైవేద్యము జరుగును. పిదప తలుపు మూయబడును.

4. సాయంత్రము సుమారు 7 ఘంటలకు తోమాలసేవ, అర్చనజరిగి, రాత్రిగంట నైవేద్యము జరుగును. తర్వాత జనులను దర్శనమునకు విడుదురు.

5. రాత్రి రమారమి 9 ఘంటలకుమీద శ్రీస్వాములవారికి ఏకాంతసేవఅను పాన్పుసేవజరుగును. తరువాత తలుపులు మూయబడును. విశ్వరూపదర్శనమునకును, మొదటిగంట దర్శనమునకును, రాత్రిగంటదర్శనమునకును యాత్రీకులు పైకముకట్టకనే శ్రీస్వాములవారి దర్శనము చేయవచ్చును. మిగత తోమాలసేవకును, ఏకాంతసేవకును ఒక్కొక్కదానికిని అయిదుగురువఱకు రూపాయలు 13 ను, అర్చనకు నలుగురికి రూపాయలు 7 ను, పూలంగి, పులకాపు సేవలకు ఒక్కొక్క రూపాయయు కట్టవలెను. శేవలలో ఇవి ముఖ్యమైన శేవలు. కర్పూర హారతి యివ్వవలయునని యాత్రీకులు కోరినయెడల ఒకరూపాయ



కట్టడము కట్టవలెను. ఇదిగాక యాత్రీకులు వేరువేరుగ నీక్రింద నుదహరించు సేవలు, వాటికట్టడములతో జరిపించవచ్చును.

### సేవలుయొక్క వివరములు, వాటి కట్టడములు.

| | | | |
|---|---|---|---|
| 1. | పూలంగి శేవ | రూ | 60—0—0 |
| 2. | పులకాపుసేవ (అనగా అభిషేకము) | ,, | 420—0—0 |
| 3. | గంబురాగిన్నె | ,, | 250—0—0 |
| 4. | పునుగుచట్టపుగిన్నె | ,, | 80—0—0 |
| 5. | కస్తూరిగిన్నె | ,, | 50—0—0 |
| 6. | జాఫరాగిన్నె | ,, | 40—0—0 |
| 7. | సహస్ర కలశాభిషేకము | ,, | 1005—0—0 |
| 8. | అరతిరుపావడ | ,, | 335—0—0 |
| 9. | పూరాతిరుపావడ | ,, | 705—0—0 |
| 10. | కోవిల తిరుమంజనము | ,, | 505—0—0 |
| 11. | అమంత్రణోత్సవము (అనగా ఒకదినమున అన్నిపూజలు నడిపించుట) | ,, | 65—0—0 |
| 12. | అద్దాల మహల్ సేవ | ,, | 61—0—0 |

శ్రీస్వాములవారికి యాత్రీకులు ఆరాధనచేయు పులిహోర, లడ్డు, దధ్యోదనము మొదలగు నైవేద్యములు సాధారణముగా మొదటి గంట పూజకాలమునందు జరుగును. యాత్రీకులు అన్నముతో చేరిన పులిహోర, మొళహోర, చక్కెరపొంగలి, దధ్యోదనము, పాయసము, శీరా, కేసరిబాత్ మొదలగు పూజగంగాళములు వేయించవలెననిన

యెడల గుడికి రూపాయలు 12 కట్టడమును, వంటవానికి రూపాయ 1 కట్టడమును చెల్లించవలెను. ఈకట్టడములుగాక నైవేద్యములకు కావలసిన సామానులను తీసియివ్వవలెను. జిలేబి, చక్కెర, లడ్డు శ్రీస్వాములవారికి నైవేద్యము యాత్రికులు యివ్వవలెనన్న రూపాయలు 44 కట్టడమున్ను, మనోహరము, వడ వగైరాలు నివేదించవలెనన్న రూ 30 కట్టడమున్ను దేవస్థానాధికారులకు చెల్లించవలెను. ఇతర గుళ్లలో టెంకాయలుకొట్టి నైవేద్యములు జరుగులాగున శ్రీస్వాములవారి గుడియందున జరుగుటలేదు. ఇతర బహుమానములు యాత్రికులు శ్రీస్వామివారికి యియ్యవలెనన్న వానిని తీసుకొని శ్రీస్వాములవారికి సమర్పించుటలేదు.

శ్రీస్వాములవారికి వినియోగముచేసిన పుష్పములను తులసీదళములను ఎవ్వరికి నిచ్చుటలేదు. ఏలననగా పూర్వము రంగదాసుడను భక్తునకు అర్చకులు శ్రీస్వాములవారి పుష్పహారమునిచ్చిరి. ఆపుష్పహారములో అందమైన వెంట్రుకయుండుటంచూచెను. అప్పుడు నాభక్తుడు అస్పృశ్యుడను అడుగ, నాసంగతిని శ్రీవిష్ణుమూర్తి తెలుసుకొని అదిమొదలుకొని స్వామివారియొక్క తులసీహారములను, పుష్పముల నెవ్వరికి నియ్యగూడదని ఆజ్ఞయిచ్చెనని పెద్దలు చెప్పుచున్నారు. శ్రీ స్వాములవారికి యాత్రికులు ప్రార్థన ముడుపులు చెల్లించవలసియున్న స్వాములవారి ముఖమంటపమునందు నిర్మాణముచేసియుండు కొప్పెరయందు వేయుదురు. లేనియెడల దేవస్థాన అధికారులవద్ద చెల్లించి రశీదులు పొందుదురు. యాత్రికులు యీవిధముననుకూడ ప్రార్థనముడుపులు చెల్లించినవారగుదురు. ఈవిధమున జేయక యితర కోవలలో ప్రార్థనముడుపులను చెల్లించువారు, చెల్లించినవారినిగ భా



వింపరు. ఏలనన, తిరుపతి తిరుమలయందు దళారీలు, కమిషన్ యేజంట్లు యాత్రికుల ధనమును సంగ్రహించుటకు పర్పడియున్నారు. ఇటువంటి మోసకృత్యములు నేటికికూడా జరుగుచునేయున్నది.

ఇటువంటి మోసకృత్యములు కూడినంతవరకు నిలుపుదలకొరకై తగుయేర్పాటులు అచ్చటచ్చట నోటీసులు మూలముగా యాత్రికులకుగాను వివరపరచియున్నారు. వానిని యాత్రికులు జాగ్రత్తతో వర్తించినయెడల గమనింపనగు. యాత్రస్థులు మొట్టమొదట వరాహస్వామిని సేవించి పిమ్మట శ్రీవేంకటేశ్వరులను సేవింపవలెను. ఏలనన పూర్వము శ్రీస్వామివారు వరాహస్వామివద్ద నూరడుగుల భూమిని తన యునికిస్థలమునకు గైకొనినదానివల్ల మొదట వరాహస్వామిని సేవించవలెనని ఒడంబడిక జరిగియున్నది. కావున యాత్రస్థులు మొదట వరాహస్వామినే సేవించి పిదప శ్రీస్వామివారిని సేవించుచున్నారు. యాత్రస్థులు రొక్కముగా ఆభరణరూపమునను బంగారురూపమునను ఒసంగు కానుకలే శ్రీ స్వాములవారికి ముఖ్య వరుంబడి. దీనివలన శ్రీస్వాములవారికి సంవత్సరమునకు రమారమి 4 లక్షలరూపాయలు వచ్చుబడికలదు. బంగారురూపమునను, ఆభరణరూపమునను వచ్చు వరుంబడిని సహారులో యేలము వేయించి ద్రవ్యరూపము కావించెదరు. ఇంతవరుంబడివచ్చు దేవాలయము హిందూదేశమున మరియొక దేవాలయము కానరాదు. మరియు కొన్ని గ్రామములు స్వాములవారి పూజకైంకర్యములకు దేవాలయమునకు దానపూర్వకముగ నివ్వబడియున్నవి. శ్రీస్వాములవారి దేవాలయ వరుమానమునుండి ఎగువతిరుపతి, దిగువతిరుపతి, తిరుచానూరువందునూ గల దేవాలయములలో జరుగుపూజల్లు, అర్చనలు, ఆరాధనలు, ఉత్సవ

ములకును సదరు కార్యములు జరిపించు ఉద్యోగస్థులకును, శిబ్బందీలకును విశేషధనము బటువాడ పడుచున్నది. ఇదియునుగాక సదరు స్వామివారి వరుమాన ద్రవ్యమునుండి సంస్కృత పాఠశాలయును, ఇంగ్లీషు VIth ఫారంవఱకు పాఠశాలయును, ఔషధశాలయును, విద్యార్థుల భోజనశాలలును, వేలూరులో మహంతు హైస్కూలును, రేణిగుంటయందు ప్రైమరి పాఠశాలయును జరుపబడుచున్నవి. సదరు స్వామివారి వరుమానములో సరాసరికి సగముద్రవ్యము శెలవగుచున్నది. పైనుదహరించిన వరుంబడిగాక శ్రీస్వామివారికి వెలలేని ఆభరణములు గలవు. మూలస్వామివారికి మకరకంఠి లక్ష్మీకాసుల మాల సాలగ్రామ హారము, ఉత్తరజందెము, స్వర్ణపీతాంబరము, నాగాభరణము, వెలలేని రత్నములుపొదిగించిన కర్ణపత్రములు, పచ్చతోపొదిగించిన బంగారు కిరీటము మొదలగు పూర్వపు నగలు గలవు. మైసూరులో షరాపుగానుండిన కొళ్ళేగాల్ వీరన్నశెట్టిగారు వెలలేని వజ్రకవచము, రత్నములతోపొదిగించిన కిరీటములోనగు నగలను ఉత్సవ విగ్రహములకు సమర్పించిరి. శ్రీస్వామిలవారి ఆభరణములను మతింపువేయుటకు ఎవరికిని అసక్యము గానేరదు. ఇవిగాక బంగారుపాత్రలు, వెండిపాత్రలు, వెండి బంగారముతో చేయించిన గుఱ్ఱములును, ఏనుగులును యింకా అనేకవాహనములు గలవు. పై వానిలో కొన్ని స్వామివారి ద్రవ్యమునుండి చేయబడినవి. మఱికొన్ని యితరులవల్ల ధర్మార్థముగ చేయబడినవి. వేంకటేశ్వరులకు సంబంధించిన దేవాలయములు ముప్పదినాలుగు. వాటిలో ముఖ్యమైనవి ఏవియనగా (1) వేంకటాచలముమీద వరాహస్వామివారిగుడి. (2) దిగువతిరుపతిలో గోవిందరాజులువారిగుడి. (3) కోదండరామస్వామివారి యాలయము. (4) కపిలతీర్థమువద్ద కపిలేశ్వరస్వామివారి గుడి.



(5) తిరుచానూరులో అలిమేలుమంగమ్మగుడి యనునవి. వీటిలో వచ్చు వరుంబళ్లు చాలా తక్కువగాని వాటిఖర్చులకు చాలవు. చాలని దానికి శ్రీస్వామివారి ఖజానానుండి శెలవుచేయబడుచున్నవి. యీ మొత్త దేవాలయములనే తిరుమల తిరుపతి దేవస్థానములని వాడుచున్నారు.

తిరుమలయాత్ర సల్పువారు మొదట తెల్లవారిజామున కపిల తీర్థంబున స్నానమాచరించి పర్వతారోహణముచేసిన పిదప స్వామివారి పుష్కరిణియందు మునిగి వరాహస్వామిని శేవించి అటుతరువాత శ్రీవేంకటేశ్వరులను సేవింతురు. పర్వతావరోహణము చేసిన తరువాత తిరుచానూరికిపోయి అలిమేలుమంగమ్మను సేవింతురు. స్నానమాచరింపకయు అన్నపానాదులుచేసియు తిరుమల యెక్కకూడదనియు, భోయజనము చేయక పర్వతావరోహణము జరుపతగదనియు పెద్దలు చెప్పెదరు. భక్తశిఖామణు లనేకులీనిష్టను నడుపుదురు. యాత్రస్థులనేకులు ఆపద సమయములయందు శ్రీస్వాములవారికి మ్రొక్కుకొని ముడుపులు చెల్లించుటయేగాక తలరోమములు శ్రీ వేంకటేశ్వరులకు సమర్పించెదరు. బిడ్డలకు మొట్టమొదట ఇచ్చటనే రోమములు తీయుదురు. యాత్రస్థులనేకులు ఉపనయ నోత్సవములను యిచ్చటనే జరిపెదరు. తిరుమలను పాదరక్షలతో యెక్కకూడదనియు, మంచములపై పవ్వళింపగూడదనియు, స్త్రీసంభోగము జేయరాదనియు పెద్దలనేకులు నుడివెదరు. అయితే జనులనేకులు యీకట్టుబాట్లనుమీరి మితములేని అక్రమములు జరిపించుచున్నారు. తిరుమల మీద జనులు పుష్పములనుధరించు పాదరక్ష లుపయోగించుట మాత్రము గానరాదు. తిరుమలనెక్కుటకు తిరుమతి మంగాపురము

యీ రెండుమార్గములు యాత్రికులకుగల సదుపాయములు. మఱియు చిన్నమార్గములును గలవు. అయితే పైనుదహరించిన మార్గములే ముఖ్యములు. వీటిలో తిరుపతిమార్గముననే యాత్రికు లనేకులు పర్వతారోహణము చేయుచున్నారు. తిరుపతిమార్గంబున తిరుమలకు 7 మైళ్ళ దూరముగలదు. తిరుమలచాటుటకు ఏడుపర్వతము లెక్కవలెను. వీనిలో మొదటిదగు గాలిగోపురము మిగుల ఎత్తైనదియు దీని నెక్కుట జనులకు అతిప్రయాసము కలుగును. మిగిలిన ఆరుపర్వతము లెక్కుట అంత ప్రయాసముకాదు. యాత్రికులను తిరుమలకు దీసికొని పోవుటకు డోలీలను మేనాలును గలవు. డోలీలలో పోవుటకు ప్రయత్నించువారు మనిషి ఒకటికి 3 లేక 4 రూప్యములు యిచ్చెదరు. మేనాలలో పోవుటకు భాగ్యవంతులకుతప్ప మిగతవారికి అలవికాదు. బురకా డోలీలలో బోవుటకు సాధారణమైనవారికి సాధ్యముకాదు. బీదలగువారు సాధారణ డోలీలలో పోవుదురు. మరియు భక్తితోనుండు వృద్ధులు, పురుషులు, ధనికులు, పిల్లవాండ్లు డోలీలయం దారోహింపక భక్తితో గోవింద, నారాయణయను హరిస్మరణ పదముల నుడువుచు పాదచారులుగానే కష్టములకోర్చి తిరుమలెక్కెదరు. ఈ మార్గమునందు జనులు విశేషముగ సంచారముచేయుటచేతను దారి చక్కగయుండుటచేతను, తిరుపతికి దగ్గరనుండుటచేతను జలసవుకర్యముగా నుండుటచేతను జనులు యీమార్గముననే విశేషముగ పర్వతారోహణము చేయుదురు. రెండవదియగు మంగాపుర మార్గమున నెక్కుట 6 మైళ్లు దూరముమాత్రమే కలదు. సదరు మంగాపుర మార్గము అంత భద్రముకానందుచేత విశేషముగ జనులు పోవుటలేదు. ఈపర్వతంబున కోనలు దట్టముగ చెట్లు బహు రమణీయముగా అందముగ నుండును. ఐదవపర్వతపు దిగుడునందుగల అవ్వాచారికోన



అనునది నిండా లోతులో చెట్లు దట్టముతోను చూపునకు నతి భయంకరముగా నుండును. తిరుమలయందు శీతకాలమునందు అధికమైనచలి యుండును. ఎండకాలమునందుమిగుల ఉష్ణము లేకయుండును. చైత్ర వైశాఖ జ్యేష్ఠ ఆషాడమాసములందీ పర్వతమున విషవాయువులువలన తిరుమల నివాసులకున్ను జ్వరాదిభాధలు కలుగును. ఈపర్వతమందుగల కొన్ని విషవృక్షములు, మూలికలుచేత, గాలి, విషవాయువుతో మిళితమై వీచుటవలన జనులకు జ్వరాది నొప్పిబాధలు కలుగును. ఒకటి రెండు రోజలుండువారికి అట్టి వాయువువలన బాధకలుగదు. విశేషదినము లుండువారికిని ఆరోగ్యమును గమనించనివారికిని తప్పక విషజ్వరాది బాధ కలుగును. స్వామి పుష్కరిణీతీరంబున రెండు గొప్ప రాగి మ్రాకులు గలవు. వీటినుండి విషవాయువు వీచుటవల్ల జనులకు యెందుకొ రోగమువచ్చునో తెలియదు. తిరుమలనుండి సానరాళ్లు విశేషముగ తయారుచేయుచున్నారు. తిరుమల పట్టణముచుట్టు నానావిధములగు ఫలవృక్ష తోటలుగలవు. తిరుపతినుంచి తిరుమలకుపోవు మార్గములో అల్పిరికి దగ్గర నొక బావియు, గాలిగోపురమునకు సమీపమున నొకబావియు, మామండూరు తానాకు సమీపమున నొకబావియు, తిరుమలమార్గ మధ్యంబున ముగ్గుబావియను పేరుగల నొక బావియును గలవు. ముగ్గుబావిజలమును మార్గస్థులు త్రాగుట కుపయోగించెదరు. అవ్వాచారికోనకు సమీపమున నొక బ్రహ్మాండ బావికలదు. అది శిథిలమైయున్నది. తిరుమలమార్గములో అక్కడక్కడ మార్గస్థులకు ధర్మార్థమునకుగాను నీటిచలివేంద్రముల నేర్పాటు చేసియున్నారు. యాత్రిస్థులాయాసమును తీర్చుకొనుటకు అక్కడక్కడ మంటపములను నిర్మానించియున్నారు. తిరుమలయందు ఆళ్వారు

చెఱ్వునుండి కొళాయిలద్వారా నీళ్లుతెప్పించి జనుల కుపయోగ పఱచుచున్నారు. ఈ పుణ్యపర్వతంబున హిందువులుతప్ప ఇతర జాతులవారెక్కుటలేదు. ఇటీవలన ఆంగ్లేయులు తిరుమల నెక్కుచున్నారుగాని, దేవాలయ గోపురమునకులోపల ప్రవేశించుటలేదు. ఆంగ్లేయ ఉద్యోగస్థులు దిగుటకు గతించిన మహంతు భగవాన్ దాసుజీవారు బంగళానొకదానిని నిర్మించియున్నారు. తురకలు, పంచమజాతివారు పర్వతమెక్కుటలేదు. పంచములు అల్విరియను స్థళంబునకు వచ్చి కపిలతీర్థంబునకు సమీపమున మాలవాడిగుండమను తీర్థమున స్నానమాచరించి తోలుతో తయారుచేయబడిన గొప్ప క్రొత్తపాదుకలను సమర్పించి గాలిగోపురదర్శనము చేసుకొని కడతేరుచున్నారు. పూర్వకాలంబున నీదేవాలయము హిందూదేశమును ఏలుచుండిన రాజులు తగిన విచారణలతో పరిపాలన జరిగించుకొనుచు మిగిలిన మొత్తమును లాభమును పొందుచుండిరి. మహమ్మదీయ కాలమునందును వరుంబడిని మహమ్మదీయరాజు లనుభవించుచువచ్చిరి. ఆంగ్లేయుల దొరతనము వచ్చినతర్వాత యీదేవాలయము తమ యధికారములో నుంచుకొని వరుంబడిని అనుభవించుచువచ్చిరి. పిదప కొంతకాలమువరకు యీదేవాలయ విచారణను వదలుకొనిరి. ఆకాలంబున తిరుపతి హాత్తీరాంజి మఠాధికారిగానుండిన సేవాదాసు మహంతువారిని తిరుమల తిరుపతివగైరా దేవస్థానముల విచారణకర్తగా నియమించి, వారికితరువాత వారిశిష్యులకు పరంపరగా సదరు దేవాలయమునకు విచారణకర్తలుగా చెందునట్లు సన్నదును దయచేసిరి. సేవాదాసులవారు సన్నదుప్రకారము శ్రీస్వామివారి కార్యములను భక్తిశ్రద్ధలతో నిర్వహించుచుండిరి. సేవాదాసువారు గతించిన వెనుక అతని శిష్యుడుగాయుండిన ధర్మదాసు మహంతువారు విచారణకర్తగా నియమింపబడిరి. అతనుకాలధర్మము చెందినపిదప ధర్మదాసు మహంతువారికిపిదప భగవాన్ దాసువారు విచారణకర్తపదవికివచ్చి 1890 వ సంవత్సరము జనవరి నెలవఱకు అధికారముచేసిరి. పిదప భగవాన్ దాసువారి శిష్యులగు మహాబీర్ దాసువారు విచారణకర్తయై అధికారముజరిపి మృతులైరి. అదిమొదలు దేవాలయము పంచాయతిదార్ల విచారణక్రిందనుండి ఆతరువాత రామ కిసోర్ దాస్‌జీవారు విచారణకర్తగా నియమింపబడిరి. వారు గతించిన వెనుక ఇప్పటిమహంతు ప్రయాగదాస్‌జీవారు విచారణకర్తృత్వమునకు వచ్చి అదిమొదలుకొని శ్రద్ధాభక్తితో శ్రీస్వామికార్యములను సంతృప్తిగ నడిపించుచు దేవస్థాన ఆపీసును బహురమ్యముగా కట్టించి దేవాలయమునకంతయు బంగారు ధ్వజస్తంభములను యేర్పరచిరి. శ్రీ మహంతువారు తిరుపతియందే తమ మఠమునందు నివసించుచు తిరుమలకు అప్పుడప్పుడు ఉత్సవకాలములందు బోవుచున్నారు. యాత్రస్థులు తిరుమలపట్టణమునకు బోవుటకుముందుగా శ్రీగోవిందరాజస్వామివారిని, శ్రీకోదండరామస్వామివారిని, శ్రీకపిలేశ్వరస్వామివారినిన్ని దిగువ తిరుపతియందు దర్శించుచున్నారు. దిగువ తిరుపతి యందలి దేవాలయములకెల్ల ఈమూడు దేవాలయములే గొప్పవియును, ముఖ్యములైయున్నవి.



## శ్రీ గోవిందరాజస్వామివారి దేవాలయము.

---

పూర్వంబున పార్థసారథిస్వామివారి కోవెలగనుండెను. ఇందులకు దృష్టాంతముగా నిప్పటికిని గోపురద్వారముల కెదురుగ పార్థ

సారథి స్వామివారి గుడియు, అందులో వారి విగ్రహమును గలవు ఈవిగ్రహమిప్పుడు భిన్నమైయున్నది దీనికి పూజ నైవేద్యములు జరుగుటలేదు. పార్థసారథి స్వామివారి ఉత్సవ విగ్రహములనే యిప్పుడు గోవిందరాజస్వామివారి ఉత్సవ విగ్రహములుగానుపయోగించుచున్నారు. ఇప్పుడీ గోవిందరాజస్వామివారి ఆలయమందొకచోట స్వయంభువుగ వెలసియుండిన మూలవిగ్రహము చిదంబరమునుండి తిల్లైయను వారకాంత, మహమ్మదీయుల భీకరభాధచేత భద్రపరచి యిప్పటికి బహుకాలమనకుమున్న తిరుపతికి దీసుకొనివచ్చి ప్రతిష్ఠ కావించెనని చెప్పుటయేగాన దీని నిశ్చయము తెలుసుకొనుటకు ఆధారభూతమేమియుకానరాలేదు. ఈవిగ్రహమునకు అభిషేకముజరుగుట లేదు ప్రోక్షణమాత్రము జరుగుచున్నది శ్రీ గోవిందరాజస్వాములవారు శ్రీ వేంకటేశ్వరులకు జ్యేష్ఠసహోదరుడని వాడుచున్నారు. వీరి విగ్రహముమిగులగొప్పదియు అందమైనట్టిదియు తలక్రింద కొలతపాత్రనుంచుకొని పవ్వళించియున్నారు. ప్రతిసంవత్సరము వైశాఖ జ్యేష్ఠమాసములందు గోవిందరాజస్వామివారికి నవదినములు మహావైభవముతో ఉత్సవముజరుగుచున్నది. శ్రీగోవిందరాజస్వామివారియాలయమును లోపలిగోపురప్రాకారాదులను పూర్వము యాదవరాయ పట్టాలవారుకట్టించిరి. బైటి పెద్దగోపురమును అనంతరాజుగారు కట్టించిరి.

<u>శ్రీ కోదండరామస్వామిగుడిలో</u> శ్రీరాములవారు, లక్ష్మణస్వామి, సీతాదేవి వీరి విగ్రహము గలవు. శ్రీరాములవారు తిరుపతికి వచ్చి వేంకటాచల యాత్రగావించి శ్రీ వేంకటేశ్వరులను సేవించినందులకు గుఱుతుగా తిరుపతియందు జాంబవంతుడు శ్రీరాములవారిని ప్రతిష్ఠ చేసెను. తరువాత జనమేజయ మహారాజు దేవాలయమును గట్టించెను.



జనమేజయ మహారాజు శ్రీ కోదండరామస్వామివారి దేవాలయమును గట్టించినందులకు దృష్టాంతముగా నీగుడియందొకచోట రాతిస్తంభములో వీరి కుటుంబసమేతముగా వీరి ప్రతిమలు చెక్కబడియున్నవి. అటుపిమ్మట యాదవరాయ పట్టాలవారు గోపుర ప్రాకారాదులను గట్టించిరి. శ్రీ కోదండరామస్వామివారికి ప్రతిసంవత్సరము ఫాల్గుణమాసంబున బ్రహ్మోత్సవము జరుగుచున్నది. ప్రతి శనివారంబున స్వామివారికి హారతి, నైవేద్యములును, పునర్వసు నక్షత్రంబున స్వామివారికి ఉత్సవములును జరుగుచున్నవి. గీ॥ ప్రాజ్ఞులెవ్వారు శ్రీరామ రామ రామ-యనుచు సతతంబుపఠియింతు రట్టివారు-భుక్తి ముక్తుల రెంటిని బొందువార-లిందుకు సంశయింపంగ నేలయనఘ॥ క॥ కొలిచినది రామచంద్రుని-దలచినది పరస్వరూపధ్యానముసేయ-వ్వలచినది ముక్తిలలనను-నిలిచినది పురాకృతంబు నిజమని తెలుప॥

తిరుపతియందు యాత్రస్థులు దిగుటకు ఈపురంబు మధ్యంబున అనగా శ్రీ గోవిందరాజస్వామివారిగుడికి సమీపమున విసాలమగు ధర్మశాలయు, నర్రా శేషన్న సత్రమును గలవు. ఈ రెంటి స్థలముల యందు యాత్రస్థులు నెల్లవారును దిగవచ్చును. ఇవిగాక మహంతువారు కట్టబడియుండు ధర్మశాలకు దగ్గర మైసూరు మహారాజుగారి సత్రమును, శ్రీ కోదండరామస్వామివారిగుడికి ఎడమపార్శ్వ సమీపమున అనగా తిరుమలకుపోవు మార్గంబున విశాలమగు దేవస్థానపువారిచే కట్టబడియుండు పుష్పతోటఅను ఆశ్రమమును గలవు. ఈ ఆశ్రమమునందు యాత్రస్థులు దిగుటకు మఠాధికారుల యుత్తరవుపొంది దిగవచ్చును. ఈ రెండుస్థలములు యాత్రికులకు మిగుల అనుకూలములుగాను, ఉచితముగాను వున్నవి. శ్రీగోవిందరాజస్వామివారి ఉత్తరమాడ

వీధియందు పెద్ద జియ్యంగారువారి సత్రమొకటిగలదు. దీనియందు బ్రాహ్మణులుమాత్రము దిగుచున్నారు. ఈసత్రములుగాక యీపురంబున నాలుగైదు యితర సత్రములుగలవు.

సదరు సత్రములు శిధిలమైనందుచేత యాత్రస్థులు దిగుటకు వసతియైనవికావు. నీటి ఆధారవిషయములో నరసింహతీర్థమను మంచినీళ్లగుంటయును, రామచంద్రునిగుంట, తాతయ్యగుంట, అంబాలగుంట మొదలగు నీరాధారముగలవు. వీనిలో నరసింహతీర్థము ముఖ్యమైనతీర్థము. తిరుపతి నివాసస్థులు విశేషముగా నీతీర్థమునుండే త్రాగుటకు జలము నుపయోగించెదరు. మిగత తీర్థములలోనుండు జలము త్రాగుటకుచితముగానుండదు. ఇవిగాక చంద్రగిరి రైలుస్టేషనుకు సమీపంబున కొంతదూరములో త్రవ్వబడిన బావులనుండి జలము గొట్టములుద్వారా తెప్పించి నుపయోగపఱచెదరు. అయితే వీనిలో చాలినంతజలము సదా వచ్చుటలేదు. శ్రీ వేంకటాచల యాత్రకై దినమునకు సరాసరికి వెయ్యింటికి తక్కువలేక హిందూదేశపు అనేకదిక్కులనుండి యాత్రస్థులు వచ్చుచున్నారు. వారు దిగువతిరుపతి యందుండగల దేవాలయములను, తీర్థమును దర్శించి అవల తిరుమల నారోహణము చేయుదురు. విశేషదినములందు యాత్రస్థులు దిగుటకు చాలినంత సత్రములులేనందున చాలా కష్టపడుచున్నారు. ఈ పురవరంబున చాలినంత అన్నమొసంగు సత్రములు లేవు. ఆ॥ ఇంచుకంతయన్న మీశ్వరార్పణమన్న-పుణ్యలోకమునకు బోవునతడు-అధికమేదిలేదు-యన్నదానముకంటె విశ్వదాభిరామ వినురవేమా॥

అయితే దక్షిణదేశంబున అన్నదానమొసంగు సత్రములనేకముగలవు. పెద్దపెద్ద దేవాలయములుగలవు. దక్షిణదేశంబున అన్నదానమింతని వర్ణింప శక్యముగాదు. కొన్నిసత్రములలో రెండుతెగని అన్నదానము బీదలకు, సాధులకు వినియోగపఱచుచున్నారు. అయితే తిరుపతియందు శ్రీ మహంతువారు బైరాగులకు కొందఱికి సదావర్తియు, కొందఱికి అన్నము నిడుచున్నారు. తిరుమల, తిరుపతి, తిరుచానూరు దేవాలయములందు స్వామివారికి నైవేద్యమైనవెనుక సదరు నైవేద్యములను ప్రతిఫలమున కిచ్చుచున్నారేగాని ధానమూలముగా బీదజనుల కిచ్చుటలేదు. అయితే సదరు నైవేద్యములను కొందఱికిమాత్రే యుచితమొసంగుట కేర్పాటులుగలవు. ఇవితప్ప యితర అన్నదానమొసంగు సత్రములే లేవు గాన హిందూదేశపు పలుభాగములనుండి వచ్చు యాత్రసులలో భాగ్యవంతులు వీటిని దీర్ఘాలోచనజేసి కూడినంతవఱకు సహోదర యాత్రస్థుల యుపయోగముకొఱకు దిగుటకు కొన్నిసత్రములును, అన్నసత్రములు కొన్నియు నిర్మానించి శ్రీ స్వాములవారికృపకు పాత్రులగుదురని నమ్ముచున్నాను.



తిరుపతియందు దొరుకు ముఖ్యవస్తువు లేవియనగా (1) సానరాళ్లును, మట్టితో చేయబడిన అందమగు వేంకటేశ్వరులు మొదలగు దేవతాపటములును, పలువిధ ఏపి, చందనపుకర్రా కొయ్యలతో చేయబడు అనేకతెరంగులగు కొయ్యబొమ్మలును, పాత్రసామానులును, ఇత్తడి, కంచు, రాగి వీనితో తయారుచేసిన బొమ్మలు, గంటలు, అండాలు, బిందెలు మొదలగు వస్తువులును, రాగి, కంచు, వెండి లోహములతో తయారుచేయబడిన ఉత్సవ విగ్రహములును, నానావిధములగు శిలారూపములైన దేవతావిగ్రహములును, చేతితో వ్రాయబడు అంత

గును దేవతాపటములును, యింకా ననేక విచిత్రమగు ప్రతిమలును తయారుచేయుచున్నారు. శ్రీ వేంకటాచల యాత్రస్థులు విశేషముగా బొమ్మలను, పటములను, పాత్రసామానులును, కొయ్యలతో చేయబడిన విచిత్రమగు బొమ్మలను కొనెదరు. ఇటువంటి వ్యాపారములలోగూడ దళాలీలు యాత్రస్థులను మోసకృత్యపు మాటలచే దగాపుచ్చి గ్రాసము జరుపుకొందురేగాని తుదకు మట్టికైనను యిట్టి నిష్ఫల వృత్తులచే కొరగారు మాయనరులు.

దిగువతిరుపతియందు సంవత్సరమునకొకతూరి మేనెలలో 8 రోజులు గంగజాతరయను ఉత్సవము నిండా విశేషముగా జరుగుచున్నది. యీతిరుపతికి గంగమ్మ గ్రామశక్తి. ఈమెకు వూరికి బయట తాతయ్యగుంటవద్ద గుడియొకటిగలదు. ఈమె శ్రీ కృష్ణమూర్తికిని, శ్రీ వేంకటేశ్వరుల వీర్లతో బుట్టువనియు చెప్పుచున్నారేగాని మాయనురులు గనుగొనుట నసాధ్యము. వాంతి భ్రాంతి మహామ్మాయి స్ఫోటకములగు వ్యాధులు వూరిలో వ్యాపించియుండు సమయంబున సదరు గ్రామశక్తికి పొంగిళ్లుబెట్టి ప్రార్థనచేయగా సదరు వ్యాధులను పోనడుచుటకు గ్రామశక్తి కర్తయని జనులు నమ్ముచున్నారు. గంగమ్మ యుత్సవకాలంబున 8 రోజులు జనులు అనేక విధముల ప్రార్థనలగు వేషములను ధరించియాడుచు, పాడుచున్నారు. కొందఱు బండవేషములనుధరించి పలువిధ దుర్భాషలతో గంగమ్మను నిందించుచు టప్పాలు పాడుచున్నారు. అట్లు నిందించుట గ్రామశక్తికి ఇష్టమని జనులు చెప్పెదరు. 7 వ రోజున బెండుతో తయారుచేయబడిన చప్పరములను నడుములలో కట్టుకొని పాడి, యాడెదరు. గ్రామశక్తి మహాత్మ్యముచే వారికి బాధలేమియు లేదని నుడివెదరు.



కడపటి దినంబున అనగా 8 వ రోజున గ్రామశక్తి గుడిలోనే ప్రమాణితోను, మట్టితో నొక గొప్పబింబమును తీర్చి మేకలను, గొర్రెలను, కోళ్ళను, యెనుబోతులను బలియిచ్చెదరు. ఈయుత్సవ వైభవమును జూచుటకు చుట్టుప్రక్క ప్రదేశములనుండి జనులనేకులు వచ్చుచున్నారు. గంగజాతర తిరుపతియందు జరుగునంత ప్రబలముగా నెచ్చటను జరుగుటలేదు. పూర్వము జరుగుచుండినంత ప్రబలముగా నిప్పుడు జరుగుటలేదు. తిరుపతి గ్రామశక్తికి జనులు అనేకదేశములనుండి కూడావచ్చి ప్రార్థనలు చెల్లించుచున్నారు.

## తిరుచానూరు.

తిరుపతికి సమీపంబున మూడుమైళ్ళదూరంబున సువర్ణముఖి నదీతీరంబున తిరుచానూరు నున్నది. దీనిని చిరుతానూరనియు చెప్పుచున్నారు. ఈస్థలము పూర్వంబున భాగవతమును పరిక్షున్మహారాజున కుపదేశించిన శుకమహర్షి యాశ్రమముగనుండెను. పద్మావతి నిచట నుండునట్లు ఏర్పఱచిన సమయమున విష్ణుమూర్తి ఈస్థలమును అగ్రహారముగ నొనర్చెను. ఇచ్చట పద్మావతి యాలయంబును, పద్మసరస్సును గలవు. పద్మావతినే అలిమేలుమంగమ్మయనియు జనులు వాడుచున్నారు. యీ రెండవపేరునుబట్టి యీపురంబునకు అలిమేలు మంగాపురమని పేరుగలిగెను. యాత్రస్థులు శ్రీ వేంకటేశ్వరులను సేవించినతరువాత తిరుచానూరులో అలిమేలుమంగమ్మను సేవింతురు. ఈ అమ్మవారికి ప్రతిసంవత్సరము కార్తీకమాసంబున బ్రహ్మోత్సవము జరుగుచున్నది. కార్తీకశుద్ధ పంచమిదినంబున తీర్థవారియు జరుగుచున్నది. ప్రతి శుక్రవారము మహావైభవముతో అమ్మవారికి తోటయుత్సవము జరుగుచున్నది, మార్గశిరనెలలోవచ్చు ముక్కోటియును

త్రైనెలలోవచ్చు రథసప్తమి, కౌశికద్వాదశి విశేషదినములు. ఈదినములలో ఉత్సవవైభవములు జరుగును. అమ్మవారి దేవాలయములో నొక ప్రక్క శుకమహర్షి ప్రతిష్ఠకావించి పూజించుచుండిన శ్రీకృష్ణమూర్తి గుడియును దానియందె బలరామ విగ్రహమును గలవు. అమ్మవారి యాలయములోనే సుందరరాజస్వామివారి సన్నిధియును గలవు. ఇవిగాక దేవాలయమునకుబయట రథమునకు దగ్గిర శ్రీ సూర్యనారాయణమూర్తి గుడియును విగ్రహమును గలవు. తిరుచానూరియందు పూర్వము వరద రాజస్వామివారి దేవాలయమొకటి యుండెను. అది శిథిలమైపోయెను. ఆదేవాలయ మూలవిగ్రహము యిప్పుడు తిరుపతిలో నరసింహ తీర్థము ఒడ్డున పడమటిభాగమునందు వేసియుండు విగ్రహమని జనులు చెప్పుచున్నారు. అది మిగుల గొప్పవిగ్రహము. తిరుచానూరియందు పూర్వము వరదరాజస్వామివారి దేవాలయమందలి యితర శిలావిగ్రహములు నరసింహతీర్థపుగట్టునను ఆతీర్థమునకుపోవు మార్గమునను తిరుచానూరు పోవుమార్గమున అంకాళమ్మగుడియొద్దను పెట్టబడి యున్నవి. మీదవివరించిన ప్రకారము వీరలక్ష్మి, వ్యూహలక్ష్మియను ఇద్దఱు లోకమాతలును ఈ పద్మసరస్సున బంగారుపద్మంబున పుట్టిన దానివల్ల దీనికి పద్మసరస్సుఅని పేరుగలిగెను. వ్యూహలక్ష్మి, వీర లక్ష్మి జన్మదినమగు కార్తీకశుద్ధ పంచమిదినంబున నీపద్మసరస్సునందు స్నానముచేయువారికి గలుగు ఫలమింతని వక్కాణింప నశక్యంబు. యీసరస్సు చక్కని రాతికట్టడములను మధ్యచూపునకు అతి గమ్యమగు మంటపమును గలిగియున్నది. స్వర్ణముఖి నీరు యీ సరస్సు లోనికి కాలువగుండ పారుచున్నది. దీనిజలమునే జను లుపయోగ పఱచుచున్నారు. తిరుచానూరు జలసౌకర్యము గలదియగుటచేతను గొప్ప గొప్ప ధర్మసత్రములుండుటచేతను పద్మావతివారి సన్నిధాన



మగుటచేతను, బైటి ప్రదేశస్థులనేకులు వివాహములు, ఉపనయనములు మొదలగు మంగళకార్యములను జరుపుచున్నారు. ఇచట మధ్వమతస్థులకు గొప్ప సత్రమొకటి నిర్మించియున్నారు. దీనియందు ప్రతిసంవత్సరము డిసంబరు నెలలో అనేకమంది మధ్వమతస్థులు ఒకటిగా ఏకీభవించి వేదాది విద్యలయందు పరీక్షచేసి పండితులకు ఇనాము లొసంగుచున్నారు. కొన్ని దినములకుముందుదా ధర్మ వేద పాఠశాలను విద్యార్థులకు స్థాపించియున్నారు. తిరుచానూరికిదగ్గిర పశ్చిమ వైపున యోగుల మల్లవరమను సుగ్రామమొకటి కలదు. ఈ సుగ్రామము సువర్ణముఖి నదీగట్టుననున్నది. ఇచ్చట పరాశరమహర్షి శివలింగ ప్రతిష్ఠచేసి అనేకకాలము తపస్సు సల్పెను. ఆ శివలింగ ప్రతిష్ఠ దేవాలయ మిప్పటికిని గలదు. పూర్వకాలంబున అనేక యోగీశ్వరులు, ఋషులు, మునీశ్వరులు యీగ్రామమందు ఆశ్రమము లేర్పరుచుకొని తపస్సు లొనర్చిరి. సువర్ణముఖికి దక్షిణపుగట్టున ముండ్లపూడియను అగ్రహారమొకటిగలదు. దీనియందుకూడా పూర్వము యతీశ్వరు లనేకులు ఆశ్రమము లేర్పరుచుకొని తపస్సులొనర్చిరి. ఈ కారణములను బట్టి ఈ చిన్నగ్రామమునకు యోగుల మల్లవరమను నామధేయము గలిగినది. శ్రీ వేంకటేశ్వరులను అయిదు రూపభేదములచే పూజ లొనర్చుచున్నారు. అవేవియనగా.

(1) మూలశ్రీనివాసమూర్తి:—ఇది ఏడడుగులకంటె యెత్తుగల మిక్కిలి అందమగు శిలావిగ్రహము ప్రతిదినమును ఒకొక్క పూజ వేళయందును యీవిగ్రహమునకు ముఖకళ మారుచుండును. ఇది జాగ్రతతో చూచువారికి అగుపడును. దీనియందు సజీవకళ స్ఫురించుచున్నది.

(2) భోగ శ్రీనివాసమూర్తి:-భోగ శ్రీనివాసమూర్తి వెండితో చేయబడిన విగ్రహము. మూల విగ్రహమునకు ముందుభాగమున నున్నది. తోమాలసేవ, పవ్వళింపుసేవలోను గాక భోగసంబంధ మగు పూజలు వీరికి జరుగును.

(3) కొలువు శ్రీనివాసమూర్తి:—వీరిని ప్రతిరోజున ప్రాతః కాలమందు తోమాలసేవానంతరము కొలువుమంటపమునందు వేంచేపుచేసి వారిసన్నిధిని పంచాంగ వేదగోష్ఠిచేయించి ముందురోజు నవ్వు వరుంబడి లెక్కలను విలావరిగా చదువుదురు.

(4) ఉగ్ర శ్రీనివాసమూర్తి:—కౌశిక ద్వాదశిరోజున సూర్యోదయ పుట్టుటకుముందుగా వీరిని శృంగారించి తిరువీధులందు పూరేగింపు చేయింతురు.

(5) ఉత్సవ శ్రీనివాసమూర్తి:—ఉత్సవకాలములందు పూరేగింపు చేయుటకు యీవిగ్రహము నిర్మితముకాబడినది. శ్రీ వేంకటేశ్వరులకు అయిదుభార్యలని పూరాణప్రసిద్ధి. (1) వ్యూహలక్ష్మి, (2) పద్మావతి, (3) బంగారు బావిలోని భార్య, (4) పూలబావి యందలిభార్య, (5) తిరుచానూరునందుండు పద్మావతియనునవి. విమాన ప్రదక్షిణమునకు దక్షిణపుతట్టుననుండు బంగారుబావియందు అడుగున అందమగు అరఅడుగు యెత్తుగల అమ్మవారి శిలావిగ్రహము కలదని చూచినవారు చెప్పుచున్నారు. ఈబావిలోని తీర్థమునే శ్రీ స్వామి వారి పూజాభిషేకములకు ఉపయోగించుచున్నారు. పూలబావి యనునది ఈశాన్యమూలయందున్నది. పూర్వ మీబావియందు స్వామివారి కుపయోగించిన తులసీపుష్పములను బావియందే వేయుచు



వచ్చిరి. అట్లు వేసినవెంటనే సదరి తులసీ పుష్పములు బావిలోనికి బోవుచువచ్చెను. అట్లు బావిలోనికి బోవుచుండిన తులసీ పుష్పములను శ్రీ స్వామివారిభార్య వానిని ధరించుకొనుచుండెనని పూర్వీకులు వాడుకొనుచున్నారు. అప్పటి సత్యకాలమునందు జరుగుచుండిన విశేష మిప్పటి అసత్యకాలవాదులకు కానరాదు. ఇప్పుడు స్వామివారి తులసిపుష్పముల పూలబావియందు వేయుటలేదు.

శ్రీ శ్రీనివాసమూర్తి శివస్వరూపులని యొకతరగతివారు వాడుచున్నారు. మరియొకతరగతివారు విష్ణుస్వరూపులని వాడుచున్నారు.

మఱికొందఱు శక్తిస్వరూపులని వాడుచున్నారు. మున్ను అగస్త్యాదిఋషులు మొదలగువారును మఱికొందరు శైవులును శివ రూపమున వీరిని పూజించియుండుటచేతను, శ్రీ స్వామివార కిప్పుడుండు సువర్ణ శంఖు చక్రములు ముందు లేవనియు, శ్రీ స్వామివారికి ఊర్ధ్వ పుండ్రముండుటచేతను, బిల్వార్చన జరుగుటచేతను, గుడిచుట్టు ప్రాకారగోడలయందు అక్కడక్కడ శివుడు మొదలగు ప్రతిమలు అగుపడుటచేతను, జటలుండుటచేతను, వీరు శివస్వరూపులని మొదటి తరగతివారు చెప్పెదరు. మొదట శ్రీ వేంకటేశ్వరులకు శంఖు చక్రములుండెననియు వానిని తొండమాన్‌చక్రవర్తి శత్రుజయార్థము శ్రీ స్వాములవారియొద్దనుండి తీసుకొనగా కొంతకాలము వారికి శంఖు చక్రములు లేవనియు, వైష్ణవమత స్థాపించిన శ్రీమాన్ రామానుజాచార్యులవారు మరల స్వామివారికి స్వర్ణ శంఖుచక్రములు చేయించి వారికి సమర్పించిరనియు, అదిమొదలుకొని శ్రీ స్వాములవారికి విష్ణు స్వరూపమున పూజలు జరుగుచున్నవనియు, రెండవతెగవారు సంజా

యిషి చెప్పెదరు. పై నుదహరించిన శివగురుతులు నిదర్శనములుగ నుండుటచేత వీగిని శక్తిస్వరూపులని చెప్పెదరు. గాన యీవిషయము లనుగూర్చి కూడినంతవరకు దృష్టాంతములుగను, సాదృశ్యములుగను, ప్రమాణములుగను శ్రీ కాళహస్తి స్థళపురాణమందు 24 వ అధ్యాయంబున చూచినయెడల ప్రతివారికి గోచరమగును.

శ్రీ వేంకటేశ్వరు లేరూపమువారైనను వీరిని అందఱును శివవిష్ణు భేదబుద్ధితో సర్వస మునిగ భావించి సేవలు జరుపుచున్నారు. అది, ఆది శంకరాచార్యులవారే శివ విష్ణువులకు నామరూప భేదంబు లేగాని, వస్తుభేదంబు లేదనియు, అట్లు భేదము చేయువారు పాపముల పాలగుదురని యుపదేశించియున్నారు. కావున యెల్లరకును శ్రీ స్వాములవారు నీకలియుగంబున ప్రత్యక్షదైవము. యెల్లరయొక్క సంకటములను కోర్కెలను తీర్చుదేవుడు. శ్రీ స్వాములవారి ప్రార్థనలు సరిగా చెల్లించనివారికిని వారి ద్రవ్యమును దొంగలించువారికిని పలువిధ కష్టములు కలుగజేయుదురు. పురాణాదులలో శ్రీ స్వామివారి మహాత్యముంగూర్చి జెప్పబడియున్నది. అనేకులు శ్రీ వేంకటాచలపతిని తమ కులదైవముగ పూజించుచున్నారు. కొందఱు గోవింద నామ సంకీర్తన పూర్వకముగ పాటలుపాడుచు భజింతురు. కొందఱు భక్తులకు భగవంతుడు ఆవేశరూపమువలన ప్రసన్నుడై కోరిన కోరికలొసంగును.

ఇట్లు నానావిధముల శ్రీస్వామివారిని భజించుచున్నారు. యెల్లరకును వారివారి కోర్కెలను నెరవేర్చుచున్నారు. కావుననే శ్రీ వేంకటాచలంబును కలియుగ వైకుంఠంబని జెప్పెదరు.



## కొళ్ళేగాల్ వీరన్నశెట్టిగారివలన శ్రీ కంచి వరదరాజస్వామికి సమర్పించుటకు సిద్ధపఱచిన వజ్రకవచమును శ్రీ వేంకటేశ్వరు డార్జించుకొను లీలావినోద వృత్తాంతము.

కొల్లెగాల మనుయూరు మైసూరు పట్టణమునకు నాగ్నేయముగా సుమా రిరువదియైదు మైళ్ళదూరములోనున్నది. అచ్చట యమిత ధనధాన్య సంపదలుగల యొక వీరన్నశెట్టిఅను వైశ్యోత్తముడుండెను. వీరన్నశెట్టి చాల ధనవంతుడు. వాని కవారిగా పెద్దలార్జించిన ధన కనకవస్తుగృహ వాహనాది సంపదలుండెను. మఱియు వారి పూర్వీకులు దాచియుండిన యమూల్య రత్నాభరణము లమితంబుగానుండెను. ఇట్లు వీరన్నశెట్టి మిక్కిలి ధర్మాత్ముడై యనేక పుణ్యకార్యముల జేయుచు తనబొక్కసము నొకనాడు శోధించ బూనసందులో తన పితామహులచే నాకాలమందు ప్రబలంబుగానుండిన చోర భయంబులకు వెలిబుచ్చక బహుకాలముగా దాచబడిన యపూర్వమైన దివ్యరత్నములుండుట జూచెను. ఆరత్నములు సుమారు వేయి కన్నను హెచ్చుగానుండెను. వానిలో కెంపులు, పచ్చలు, వజ్రములు, వైడూర్యములు, గోమేదికములు, మొదలగునవి యుండెను. వానిలో ననేక యపూర్వమైనవిగను, మిక్కిలి దృపపూరితమైనవిగను, విలువగలవిగను, గొప్ప పరిమాణములు గలవిగనుండెను. కాబట్టి వీరన్నశెట్టి తనయాప్తజన పురోహితుల రావించి యేదేవున కా దివ్యరత్నంబుల సమర్పించిన సుకృతంబు గలుగునని విచారించ వారందఱు తమ తమ యభిప్రాయంబులను జెప్పిరి. ఇట్లు పలువిధంబుల జెప్పుటచేత వీరన్నశెట్టికి దృఢముగా నేదియుదోచక దీర్ఘాలోచన

చేయుచు తుదకు తన పూర్వీకుల కిష్టదైవంబును, తనకు నిష్టదైవం
బును, 108 తిరుపతులలోని అష్టస్వయం వ్యక్తంబులం దొకటైన
శ్రీ కాంచీపురమున నెలవుకొన్న శ్రీ వరదరాజస్వామికి సమర్పించు
టకు నిశ్చయించి తద్విషయమై దైవసంకల్పం బెట్లున్నదో చూచెదనను
కొని యొక్క సుదినంబున స్వగృహంబున దేవతారాధన జేసి దివ్య
ప్రసాదముల నివేదించి కర్పూరహారతుల నిచ్చుచు తత్సమయంబున
దన్ని దేవతల నామంబుల ప్రత్యేకముగా చిన్న తాళ వృంతములపై
వ్రాసి నట్టింటం బెట్టి పూజించి తర్వాత వానిని భూమిపై నెగవైచి
ఆఱేండ్లప్రాయముగల తన చిన్నికొమార్తెను నాచీటిలలో నొకటి
నెత్తుమనగా నాబాలిక చిరునగవుతో బోయి యొకచీటినెత్తి తండ్రి
చేతికియ్య దానినిదీసి వాడు చదివిచూడ నందులో శ్రీ వేంకటేశ్వరు
డని వ్రాయబడియుండెను. వీరన్న శెట్టి కంచి వరదరాజస్వామికి
రత్నంబులనియ్య నిశ్చయించియుండెను గాన యా తీర్మానమునకు
భ్రమించి కొంతదడవు యోచించి తర్వాత శ్రీ వేంకటేశ్వరునికియ్య
మనస్సురాక ఆచీటియందలి తీర్మానమును తిరస్కరించి యొకటే
బుద్ధితో తనకిష్టదైవంబైన కంచి వరదరాజస్వామికియ్య తీర్మానించు
కొనెను. అటుపై నారత్నముల నెట్లు భగవంతున కర్పించవచ్చునని
తనకు కావలసిన బంధుమిత్ర పురోహితాప్త జనులరావించి యాలో
చించ వారందఱు నేకగ్రీవముగా నారత్నంబుల నొక యంగిగా జేసి
సమర్పించిన శాశ్వత కీర్తి కలుగునన శెట్టియు నాయేర్పాటున కొప్పు
కొనెను. తుదకొక శుభదినం బరసిచూచి తర్వాత శెట్టియు, వాని
యాప్తజనంబులును కాంచీపురమును జేరి తమకోర్కెను శ్రీ వరద
రాజస్వామివారి యర్చకులతో విన్నవించ వారందఱు తమ దేవునికి
వెలలేని రత్నాంగి చిక్కనని యమిత సంతోషభరితులై శెట్టియొక్క



యుదారత్వమునకును, భగవత్కైంకర్యమునకును మెచ్చుచు, శ్రీ వరద
రాజస్వామి మంగళవిగ్రహముయొక్క కొలతలనెల్ల చక్కగా నెత్తి
యిచ్చి వీరన్న శెట్టిని యాశీర్వదించి యతి శీఘ్రములో తమదేవునికి
రత్నాంగి, వజ్రాంగి లేక వజ్రకవచమును జేసి తెచ్చియిమ్మని ప్రార్థిం
చిరి. వీరన్న శెట్టి చాలసంతోషించి మనఃపూర్వకముగా వజ్రకవచ
మును చక్కగా జేసి తెచ్చియిచ్చెదనని వాగ్దానమొసంగి మఱల తన
యూరును జేరెను. తర్వాత యొక శుభదినంబున వీరన్న శెట్టి కంసల
వారిని పిలిపించి శుభలగ్నంబున బంగారుముద్దల కరిగించ నారం
భించిరి. శెట్టి యాదినంబునందనేక బ్రాహ్మణ సాదు సంతర్పణల
గావించి, బీదల కీవారిగా నన్నధాన వస్త్ర కాంచనంబులనిచ్చి తనకు
శ్రీ కంచి వరదరాజస్వామి కైంకర్యముచేయ ప్రాప్తమైనందుకు
మిక్కిలి సంతోషించుచుండెను. ఇట్లుండ కంసలవారు బంగారును కరి
గించి రత్నముల పొదిగించదగునట్లు పతకములుగా బోయగా బంగారు
కరగక ముక్కలు ముక్కలుగా బడిపోయెనని జెప్పగా వీరన్న శెట్టికి
మితిలేని ఆశ్చర్యము విభ్రమమునుబుట్టి యేమియుజెప్ప నోరురాక
మౌనముగా బహుసేపు యోచించి తన బంధుమిత్రుల రావించి యిది
యేమి మాయయని యాలోచించ వారలది భగవత్కార్యము గనుక
తగు నుపశాంతుల జేయక రత్నాంగిని జేయ ప్రారంభించుట తగదని
జెప్ప వాడొక శుభదినంబున శ్రీ కంచి వరదునికి గొప్ప పూజలు
జరిపించి, భజనలు స్తోత్రముల్ జేసి దివ్య కర్పూర హారతులియ్య నా
వేళ చిఱుతప్రాయముగల శెట్టికొమార్తె పూజాదుల గమనముతో
జూచుచుండి కర్పూరదీపము వెలిగించి నంతనే చలించని దృష్టితో
కొంతదడవు విలోకించుచు తటక్కున "గోవిందా గోవిందా" యని

భగవన్నామోచ్చారణము జేసి ఆవేశముతో నాడుచు ఓరి శెట్టీ రత్నాంగిని శ్రీ వేంకటేశ్వరునికిమ్ము, అన్యులకియ్యకుమని జెప్పెను. అదివిని శెట్టి కొంత విభ్రమపడి యేమిచేయుటకును దోచక నాటిదినము గడిపి మఱునాడు దృఢచిత్తముగలవాడై శ్రీ కంచి వరదరాజులకే నిచ్చెదను. వేంకటేశునికియ్యనని చెప్పుచు తన కార్యము యవిఘ్నంబుగా జేకూరునట్లనుగ్రహించమని శ్రీ కంచి వరదరాజస్వామిని ప్రార్థించి మఱుదిన ప్రభాతంబున మఱల బంగారమును కరిగించ నుద్దేశించియుండ నాటిరాత్రి శెట్టిస్వప్నంబులో పరమాత్ముడు దృగ్గోచరుండు కాగా శెట్టి నిద్రలోనుండి వులికిపడి లేచి స్వప్న దృశ్యంబుల గొంతదడవు చింతించుచు నాటిరాత్రియంతయు నిద్రబోక మిక్కిలి కళవళచిత్తుడైయుండి మఱునాడరుణోదయమున తన యాప్తజనులతో జరిగిన వృత్తాంతముల జెప్ప వారందరది శ్రీ తిరుపతి వేంకటరమణుని మహాత్మ్యముగాని వేరుకాదనుచు రత్నాంగిని శ్రీ వేంకటరమణునికి సమర్పించివేయుమనిరి. అదివిని శెట్టి దేవతలందఱు నొక్కటేను, అందఱు నద్వితీయ పరబ్రహ్మ స్వరూపులేను, ఎవరికి సమర్పించినను ఫలమొక్కటేను, అయితే శ్రీ కంచి వరదునకిచ్చెదనని వాగ్దానముచేసిన వెనుక శ్రీ వేంకటేశునికిచ్చుట న్యాయంబు కానేరదు. నేనెన్నడు వేంకటేశునికిచ్చెదనని చెప్పుకొన్నదియు లేదు. అట్లుండ నాదేవుడెందుకు పలుమారు రత్నాంగిని తనకిమ్మని యడుగుచున్నాడో తెలియదు. ఎట్లయినను నేను మాటతప్పి నడువజాలను. కంచి వరదుడే నా కులదైవము, ఇష్టదైవము వానికే నిచ్చెదనుగాని వేరెవ్వరికి నియ్యనోపనని పట్టుగా వచించుచు స్వప్నసూచనల సడ్డసేయక మఱల కంసలవారిచేతికి బంగారమునిచ్చి పనుల నారంభించుడనెను. మును



పటివలనే కంసలవారలు కనకంబును గరిగించ బంగారము తునకలుగా బోవ వారలు తొందరపడి వీరన్నశెట్టిని బిలపించిరి. శెట్టివచ్చి చూచి బహు యాశ్చర్యముతో యోచించి మదికేమియు దోచక ఎట్లయినను కంచి వరదుని విగ్రహ కొలతలకు దగినట్లు బంగారు పతకముల చేయదొడంగెను. ఇట్లుండగా మఱల నాటిరాత్రి వాని స్వప్నములో వేంకటేశ్వరులు ముసలిరూపముతో కనబడెను. అప్పుడు శెట్టి దిగ్గునమేల్కాంచి యేమిచేయవచ్చునని యాలోచించుచు స్వజనులతో స్వప్నవృత్తాంతముల జెప్పుచు భగవంతునిగూర్చి మొఱలిడి రత్నాంగిని శ్రీ వేంకటేశునికియ్యనోపక శ్రీ కంచి వరదునికే నిచ్చెదనని ప్రతిజ్ఞజేసికొనియుండ మఱల మఱునాడు రాత్రియును శ్రీనివాసమూర్తి వానిస్వప్నమునందు దృగ్గోచరుండై కం॥ శ్రీకరముగ సకలాత్ముల-ప్రాకటముగ నిండియున్న పరమాత్ముడనే-లోకేశుడ నమరేశుడ-నాకియ్యర శెట్టిగాన నవరత్నాంగిన్॥

కం॥ కలియుగనారాయణుడను-వలనొప్పగ శివ విరించి వర
దేవులకున్-తలపుననిండినవాడను-చెలిమిగ నీకిపుడు నిజము చెప్పితి శెట్టీ॥

అని భగవంతుడు సెలవిచ్చి తిరోధానుండు కాగా శెట్టి మేల్కాంచి కళవళచిత్తుడై యేమిచేయుటకును దోచక మఱుదిన ప్రభాతంబున యాపురవరంబునందుండిన కొందఱు బుధులను బ్రహ్మవేత్తలను రప్పించి యిట్లనెను. దేవ దేవులకు దేవుడు శ్రీ వరదుండా లేక శేషాద్రీశుడా అని అడిగెను. అట్లడుగగా బ్రహ్మవేత్తలు, బుధవరేణ్యులు వీరన్న శెట్టినిజూచి దేవతలందఱు నొకటే బ్రహ్మస్వరూపంబున సందియము లేదు. అయితే కలియుగదేవుండు శ్రీ వేంకటేశ్వరుండే

వానికన్న నీయుగంబున నిజదైవము, ఆపద్బాంధవుడు, ముక్తిప్రదుడు, కామిత ఫలప్రదుడు, రక్షకుడును లేరు. ఎట్లన్న వినుమాదిత్యపురాణమందు శ్లో॥ కృతేతు నరసింహోభూ-త్త్రేతాయాం రఘునందనః। ద్వాపరే వాసుదేవశ్చ-కలౌ వేంకటనాయకః॥ కృతయుగమున నృసింహస్వామియు, త్రేతాయుగమున శ్రీరామచంద్రుడును, ద్వాపరయుగమున శ్రీ కృష్ణభగవానులును, కలియుగమున శ్రీ వేంకటేశ్వరులును ప్రత్యక్ష దైవంబులై యున్నారు. మఱియును వినుము స్కాందపురాణమందు శ్లో॥ కృతేసేనా పతిఃస్కంద-స్త్రేతాయాంతు కుమారకః। సుబ్రహ్మణ్యో ద్వాపరేతు-కలౌ వేంకటనాయకః॥ కావున కృతయుగమున సేనాధిపతియైన స్కాందమూర్తియు, త్రేతాయుగమున కుమారదేవుడును, ద్వాపరయుగమున సుబ్రహ్మణ్యస్వామియు, కలియుగమున శ్రీ వేంకటేశ్వరుడును ప్రత్యక్ష దైవంబులైయున్నారు. కాబట్టి కలౌ వేంకటనాయకుండని సర్వపురాణంబులును ఘోషించుచున్నవి. కావున నీవు నీతండ్రి తాతలందఱునొక్క వంశస్థులైయున్న, నీవు ప్రభువై, సర్వాధికారివైయుండ నిన్నాశ్రయించక నిప్పుడు నీతాతనాశ్రయించిన నేమిఫలము సిద్ధించును. ఆయాయుగములం దాయాదేవతా స్వరూపంబులు జగత్సింహాసనాధిపతులైయుండిరి. వారివారి కాలమున వారివారి నాశ్రయించిన ఫలములభించునుగాని ఒకరి కాలమునందొకరి నాశ్రయించినందువలన ఫలమేమికలదు. కాబట్టి కలియుగంబున ప్రత్యక్షదేవుడు, సర్వేశ్వరుడు, దేవాదిదేవుడు, వరప్రదుడు, భుక్తి ముక్తిప్రదుడు, నిజదైవము, జగద్రక్షకుడు, దేవమానుషాసుర సార్వభౌముడును శ్రీ తిరుపతి వేంకటరమణస్వామియే యగునుగాన నీవిక నన్య చింతనలుమాని యేకమానస్కుండవై రత్నాంగిని శ్రీ వేంకటవరద రాజదైవమణికి సమర్పించు



మని యైకకంఠ్యముగా నుడివిరి. అట్లు బుధవరేణ్యులు జెప్పిన వాక్యములువిని వీరన్న శెట్టి కొంతవడి దీర్ఘముగా నాలోచించుచు తుదకు పట్టువిడుచుటకన్నను భువిలో ప్రాణమువిడుచుటమేలు. అని చెప్పుచు వజ్రాంగిని శ్రీ వేంకటేశ్వరునికియ్య సమ్మతించక కంచి వరదునికి తాజేసిన వాగ్దానమందే దృష్టింగలవాడై మఱల కంసలవారలగోని బంగరుముద్దల కరిగించగ నవి ప్రబద్ధముగా చీలిపోయెను. ఇట్లు కొంతదడవు శెట్టి విభ్రమచిత్తుడై చింతిల్లి తుదకు బంగారంబుల నేదైన లోపంబులున్నవాయని పరిశీలించ నందులో నేలాటి చెఱుపును లేకపోవుటచే నా సంభవములెల్ల శ్రీ వేంకటేశునికి వజ్రాంగినియ్యని హేతువువలన కలిగెననివలంచి భగవంతునిగూర్చి సంకటములు బెట్టకుమని వేడెను. ఇట్లు భగవంతుని వేడ శ్రీ కంచి వరదరాజుల మంగళవిగ్రహముయొక్క కొలతలకుదగినట్లు నానా యాభరణంబులు, కెంపులు, వజ్రములు, నీల గోమేధికములతో పొదువెట్టబడి వజ్రకవచము మిగులాద్భుతంబుగా దీరజూచి శెట్టి కడు యుప్పొంగుచు తుదకు భగవంతునకట్టి దివ్యభూషణముల సమర్పించి గొప్ప పుణ్యమునార్జించు భాగ్యము కలిగెగదాయని యపరిమిత సంతోషభరితచేతస్కుండయ్యెను. మఱియు శ్రీ వరదరాజస్వామి యర్చకులకు తపాలునుబంపి మఱల కొలతలదెమ్మని తాజేసిన యాభరణంబులా కొలతలకు సరిపోవుచున్నవాయని పరిశీలించి యన్నియు జక్కగా నమరినందుకును, తనకిమ్మని వాదులాడవచ్చిన శ్రీ వేంకటేశ్వరుని కొక దండను సమర్పించెదనని జెప్పి వారి యభిలాషను విడిపించి తన వాగ్దానమును నెరవేర్చి శ్రీ కంచి వరదరాజస్వామికి వజ్రాంగిని బూర్తి జేసినందుకు నుప్పొంగుచు సద్బ్రాహ్మణుల రప్పించి సుదినం

బరచిచూచి యొకనాడా వజ్రకవచమును బంగరుతట్టపై బెట్టి సద్బ్రాహ్మణుల కవారిగా భూరిభాగ్యంబులిచ్చి సాధువులకు భాగవతోత్తములకు నన్నదాన వస్త్రదాన, గోదాన, భూదానాది షోడశ దానంబులజేసి మంచి ముహూర్తమున శ్రీ కాంచీపురమునకు సకల బంధుమిత్ర దాస దాసీ జనంబులతో పయనంబైన తటి పరివారములలో నొకడు తుమ్ముతముచేసెను. దానిజూచి శెట్టి యప శకునంబని విభ్రమమొందుచుండ నాజేండ్ల ప్రాయముగల శెట్టి యాత్మజపై మఱల నావేశమువచ్చి "హరిహరి గోవిందా గోవిందా"యని కూతలుపెట్టెను. అదిచూచి యందఱును విభ్రమచిత్తులై యాబాలికచుట్టు గుంపులుగూడ నామగువ ఓ భక్తులారా! వేరాలోచనజేయక నీతక్షణమే బయలుదేరి యేడుకొండలనుదాటి హేమశిఖరాళిచే దగద్ధగాయమానమైన శ్రీ వేంకటేశ్వరుని క్షేత్రముజేరి యీరత్నకవచమును సకల దేవతా సార్వభౌముడైన శ్రీనివాసునికి సమర్పించిరండనెను. బయలుదేరు సమయముల మఱల వేంకటేశ్వరుడు భూషణమునడుగ శెట్టికి ముఖారవిందము చిన్నబోయెను. పిదప శ్రీ కంచి వరదరాజస్వామిని పెక్కువిధంబుల సముద్భాషించి దృఢమానస్కుండై రత్నాంగిని శ్రీ వేంకటేశునికియ్యనని యొకటేపట్టుగా వచించుచు శ్రీ కాంచీపురమునకుబోవ పయనంబయ్యెను. అప్పుడు దారిలో వానికనేక యపశకునంబులు సంభవించినను వీరన్న శెట్టి జడియక తనవాగ్దానము నెరవేర్చుదునని యొకటేపట్టుగా కాంచీపురికి పోవుచుండెను. అట్లు పోయి పోయి అనేక దివారాత్రములు గడుపుచు కొంతకాలమునకు శ్రీ కాంచీపురమును జేరగా కంచి వరదరాజస్వామివారి యర్చకులు శెట్టియొక్క రాకనెఱిగి దేవస్థానాదికానుకలతో నెదుర్కొనివచ్చి



శెట్టికి యనేక మర్యాదలుసేసి వాని ధర్మబుద్ధికిని భగవద్భక్తికిని మెచ్చుచు వానిపై మంకళా శాసనముల గురిపించిరి. తర్వాత యొకనాడు వే వేలు జనులుకూడ శ్రీ కంచి వరదరాజస్వామికి దివ్యోత్సవంబులజేసి రత్నాంగిని ధరించబూనగా నది సరిపడిరాకను చూచి కళవళమానసుడై యేడ్చుచున్న శెట్టినిజూచి వాని యాప్తజనులును శ్రీ వేంకటేశ్వరుని ప్రభావములకు విభ్రమమొంది, అనేకవిధముల యూరడించి శ్రీ తిరుపతి వేంకటరమణుడే దొడ్డవాడనుటకు సంశయంబులేదు. కాబట్టి నీవైరాగ్యమునువదలి అన్యాలోచనజేయక నీ తక్షణమే బయలుదేరి వేంకటాచలారోహణముజేసి వజ్రాంగిని శ్రీ వేంకటేశ్వరునికి సమర్పించుము. అది శ్రీనివాసమూర్తికి సరిపడి పోవునేని ఆదేవునికే సమర్పించుము. లేనిచో దానిని మఱల దీసుకవచ్చి కంచి వరదునికి కొలతలప్రకార మిచ్చుటనే చక్కజేసి సమర్పించివేయవచ్చుననిరి. శ్రీ వేంకటేశ్వరుని దలచినమాత్రమున భయముచే వణకుచున్న శెట్టి తనశపథ మీడేరదని దృఢముగా గనుగొన్నవాడై వజ్రాంగిని శ్రీ వేంకటేశునికే నిచ్చెదనని తీర్మానించి, మానసమందు ఘోరపాప సంక్షయకరుండైన శ్రీ వేంకటాద్రీశుని పాదరాజీవముల దలంచి భక్తిపూర్ణుండై చేతులు పైకెత్తి పరమాత్ముడును, సర్వాంతరాత్ముడును, జగదేకతండ్రియు, ఆశ్రితజన చింతామణియునైన శ్రీ వేంకటేశ్వరులను దీర్ఘదండ ప్రణామంబు లాచరించి యానందబాష్పములు ప్రాల్చుచు వరదరాజులును, సకల దైవంబులును శ్రీ వేంకటేశ్వరుడేయని తీర్మానించి భక్తిపూర్వకంబుగా హరినామ సంకీర్తనలు భజనజేయదొడంగె. ఈ ప్రకారంబుగా ధ్యానించి ఆదినమే సుదినంబని తీర్మానించి సకల బంధుమిత్ర వర్గంబుల

గూడి శేషాద్రికి పయనంబైవచ్చి నిఖిలపాప నిర్మూలనంబైన శ్రీ కపిలమహాతీర్థంబున మునిగి శ్రీ కపిలేశ్వరస్వామిని దర్శించి ప్రదక్షిణ దండప్రణామంబు లాచరించి క్రమ్మర బయలుదేరి గోవిందనామ స్మరణజేయుచు హరిసంకీర్తనలు బాడుచు నాలుకొండలనుదాటి శేషాచల శిఖరంబునుజేరి కన్నుల పండువుచేయుచు హేమ శిఖరాళిచే ధగధగ మెఱయుచున్న శ్రీ వేంకటేశ్వరుని బంగారు కోవెలను దర్శించి గోవిందనామముల బాడుచు చేతుల బైకెత్తి మ్రొక్కుచు వచ్చిచేరి యొకచోట విడిచియుండి యొక శుభదినంబున కుమార ధార రామ కృష్ణ, తుంబురు, పాపవినాశన, యాకాశగంగ, పాండవ, గోగర్భ, చక్రజబాలి, నాగతీర్థంబుల గ్రుంకి మఱల సింహాద్రికేతెంచి దాని మధ్యంబునందున్న పరమ పావనంబైన శ్రీ స్వామి పుష్కరిణీ తీర్థంబున స్నానమాచరించి షోడశ ధానంబులజేసి నిఖిలప్రాణాధారుండైన పరమాత్ముని దివ్యపాద రాజీవముల స్వాంతమున బొందుపఱచి సద్భక్త్యులర ధ్యానించి దేవతలు మహర్షులు శివ విరించి దేవేంద్రాదులచే సంతతము సంసేవించబడు శ్రీ వేంకటేశ్వరుని దివ్య కోవెలలోనికి ప్రవేశించి విశ్వరూపసేవ, తోమాలసేవ, ఘంటసేవ, తిరువంజలసేవ, పూలంగిసేవ, యేకాంతసేవ మొదలగువానినన్ని కన్నులార సేవించి బ్రహ్మానందమత్తులై తర్వాత యొక శుభదినంబున శ్రీ వేంకటేశ్వరునికి వజ్రాంగినిధరింపజేసి శ్రీదేవి భూదేవుల సమేతముగా సకల వాహనంబులపై వేంచేపుచేసి అఖండ వైభవముతో బ్రహ్మోత్సవంబుల జరిపించెను. వీరన్నశెట్టి సర్వలోక శరణ్యునిజూచి విభ్రమ మొందుచు జగన్మోహనుని సౌందర్యాతిశయములచే విజితంబగు మానస్కుండై యానందభాష్పములు ధార ధారలుగా ప్రాల్చుచు



సర్వదోష దురితహారంబైన కృపాళుని యనంతవిధముల ప్రస్తుతి జేయుచు దేహస్మృతిలేక యానందముచే నాడుచు, కరతాళములతో పాడుచు గోవిందా గోవిందాయని గంతులు వేయుచు, నిఖిల ప్రాణాధార మూర్తియైన శ్రీ వేంకటేశ్వరుని యనంత కల్యాణ వైభవముల గొనియాడి క్రిందపడి మూర్ఛిల్లెను. అతరుణమున భగవంతుని సేవించుచున్న యానన్దాది భక్తులా శెట్టి భక్తికిమెచ్చుచు వానినెత్తి యనంతవిధముల నోదార్చిరి. కొంతవడికాగా శెట్టి మూర్ఛదీరి పైకి లేచి చేతులు ముకుళించుకొని సౌందర్యనిలయునిముందు నిలచి నానా విధముగా స్తోత్రము జేసెను.

కాబట్టి బ్రహ్మాండభాండములం దెల్లడలను శ్రీ వేంకటాచలమునకు సమానమగు పుణ్యక్షేత్రంబులేదు. మహిలోన శ్రీ వేంకటేశునికి సమానమైన దైవములేదు. వీరన్నశెట్టి యాశుభదినంబున బ్రాహ్మణులకపారిగా భూరి దక్షిణలిచ్చి, సంతర్పణలజేసి, అనేక విధముల భాగవతోత్తముల సంతృప్తిపఱచి శాశ్వతకీర్తిని యార్జించి మఱల తనయూరికి ప్రయాణమైపోయెను.

గాన ఈతిరుపతి తిరుమలయాత్ర కలియుగవైకుంఠంబను తిరుపతి తిరుమల దివ్యక్షేత్ర మహాత్మ్యాత్ర గ్రంథమును చదువువారికిని. వ్రాయువారికిని, వినువారికిని ఆయురారోగ్య ఐశ్వర్యములుగలిగి అట్టివారు శ్రీ వేంకటాచలపతిదయకు పాత్రులగుదురు గాక.

శ్లో॥ శ్రీ వేంకటగిరీశాయ చిద్విలాసాయధీమతే।
పుంమోహనశరీరాయ పుణ్యాకందాయమంగళం॥

శ్లో॥ నమశ్రీవేంకటేశాయ శుద్ధజ్ఞానస్వరూపిణే।
వాసుదేవాయ శాంతాయ శ్రీనివాసాయమంగళం॥

మంగళమయ్యానీకు జయమంగళమయ్యా సహస్రనామ సన్మంగళమయ్యా నిత్య శుభమంగళమయ్యా నృసింహదాసుని న్మంగళమయ్యా సాధుజనమంగళమయ్యా ప్రచండమాధవా మంగళమయ్యా మోక్షవర మంగళమద్భుత వేంకటేశ్వరా॥

తిరుపతి తిరుమలయాత్ర కలియుగ వైకుంఠంబను దివ్యక్షేత్ర మహాత్యము సంపూర్ణము.

శ్రీ శారదా ముద్రాక్షరశాల, చిత్తూరు.

# పుస్తకముల జాబితా.

ఈగ్రంథములు వలయువారు తిరుపతి బజారువీధిలో పుస్తకములు వ్యాపారము చేయు మారుశెట్టి రుద్రయ్యనాయుడుగారికి వ్రాసి వి. పి. పోష్టుద్వారా తెప్పించుకొనవచ్చును.

| | రూ. అ. పై. |
|---|---|
| వేంకటాచలమహాత్మ్యము-వచనకావ్యము | 1—0—0 |
| తరిగొండ వెంకమ్మ రచించిన వేంకటాచల మహాత్మ్యము (పద్య కావ్యము) | 1—0—0 |
| తిరుపతి తిరుమల దివ్యక్షేత్రమహాత్మ్యము (ఇందులో తిరుపతి యాత్రలుగలవు) | 0—8—0 |
| వేంకటేశ్వరులు కోర్టులో సాక్షి చెప్పినది (అద్భుతహరికథ) | 0—3—0 |
| డిటో వచనకావ్యము | 0—1—0 |
| డిటో రథోత్సవ మహాత్మ్య హరికథ | 0—3—0 |
| డిటో వచనకావ్యము | 0—2—0 |
| చిత్తూరు వరకవి నరసింహదాసుచే రచించిన వేంకటేశ్వరశతకము | 0—2—0 |
| డిటో చిద్విలాసశతకము | 0—2—0 |
| డిటో ప్రసన్నాంజనేయ శతకము | 0—1—0 |
| రాజనామ మహాత్మ్యము | 0—1—6 |
| వేంకటేశ్వర పూజాధ్యానామృతము | 0—2—0 |
| వేంకటేశ్వర భక్తాగ్రేసరుండగు మాలదాసు చరిత్రము | 0—3—0 |
| తరిగొండ వెంకమ్మ చరిత్రము | 0—4—0 |
| వేంకటేశ్వర భగవద్భక్త భజనకీర్తనలు | 0—3—0 |
| పండరినాథుని భజనకీర్తనలు | 0—3—0 |

END OF
TITLE